ప్రతి అక్షరం ప్రజాహితం
RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com
నేటి ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
సంపుటి - 02 సంచిక -213 పేజీలు - 08 వెల - 04/- ఆదివారం 1 జూన్ 2025

# మిస్ వరల్డ్ 2025 గా

## థాయ్‌లాండ్ యువతి ఓపల్ సుచాత



- మిస్ వరల్డ్ 2025 విజేతగా థాయ్‌లాండ్ యువతి ఓపల్ సుచాత
- ఓపల్ సుచాతకు కిరీటాన్ని అలంకరించిన మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా
- ఇది 72వ ప్రపంచ సుందరి పోటీ
- ఫస్ట్ రన్నరప్‌గా మిస్ పోలెండ్, సెకండ్ రన్నరప్‌గా మిస్ పోలాండ్
- మూడో రన్నరప్‌గా నిలిచిన మిస్ మార్టినిక్

హైదరాబాద్ **మే31ఆంధ్రప్రగతి**
ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే మిస్ వరల్డ్ అందాల పోటీల్లో ఈ ఏడాది థాయ్‌లాండ్‌కు చెందిన ఓపల్ సుచాత చువాంగ్ విజేతగా నిలిచారు. తన పేరును ప్రకటించగానే ఓపల్ సుచాత భావోద్వేగానికి లోనయ్యారు. 2025 సంవత్సరానికి గాను ప్రపంచ సుందరి కిరీటాన్ని ఆమె కైవసం చేసుకున్నారు. మిస్ వరల్డ్ పోటీల్లో 108 దేశాలకు చెందిన కంటెస్టెంట్‌లు పాల్గొన్నారు.గత సంవత్సరం (2024) మిస్ వరల్డ్‌గా నిలిచిన క్రిస్టినా పిజ్కోవా, 72వ ప్రపంచ సుందరి ఓపల్ సుచాత చువాంగ్‌కు సంప్రదాయబద్ధంగా కిరీటాన్ని అలంకరించి, శుభాకాంక్షలు తెలిపారు. మిగతా 2లో...








## పేదల సంక్షేమమే కూటమి లక్ష్యం

- సకాలంలో పెన్షన్లు ఇచ్చి ఆదుకుంటున్నాం
- దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపిలోనే పెన్షన్లు
- జూన్ 1 నుంచి రేషన్ షాపుల్లో సరుకులు
- గత ప్రభుత్వంలో అనేక అవతకతవకలు
- కోనసీమ పర్యటనలో సిఎం చంద్రబాబు

కోనసీమ,**మే31ఆంధ్రప్రగతి** కూటమి ప్రభుత్వం పేదల పక్షమని, తమ లక్ష్యం వారిని ఆదుకోవడమేనని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. పేదలను ఆదుకునేందుకు వీలుగు పెన్షన్ మొత్తాన్నిపెంచడమే గాకుండా సకాలంలో అందిస్తున్నామని అన్నారు. మిగతాది 2లో...

## గోశాలల అభివృద్ధికి ప్రత్యేక కమిటీ

: ముఖ్యమంత్రి రేవంత్ నిర్ణయం
అత్యాధునిక గోశాలల ఏర్పాటుకు సీఎం రేవంత్ ఆదేశం
రంగారెడ్డి జిల్లా ఎంకేపల్లి డిజైన్లకు త్వరలో ఆమోదం
గోశాలల ఏర్పాటుపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు
తొలి విడతలో వర్సిటీలు, ఆలయ భూముల్లో నిర్మాణాలు
కనీసం 50 ఎకరాల్లో స్వేచ్ఛగా తిరిగేలా వసతులు
నిర్వహణలో ధార్మిక సంస్థల భాగస్వామ్యంపై పరిశీలన



హైదరాబాద్**మే31ఆంధ్రప్రగతి**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అత్యాధునిక సదుపాయాలతో కూడిన గోశాలలను ఏర్పాటు చేసేందుకు పటిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోవుల సంరక్షణ, నిర్వహణ మెరుగుపరిచే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నారు.రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణకు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధమిగతాది 2లో...

## నారీశక్తి ఏమిటో పాక్‌కు చాటి చెప్పాం

పహల్గాం ఉగ్రదాడికి దీటుగా జవాబిచ్చాం
ఆపరేషన్ సిందూర్‌తో గట్టిగా బుద్ది చెప్పాం
భోపాల్ పర్యటనలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మోడీ
రాణి అహల్యాబాయి 300వ జయంతి వేడుకల్లో ప్రధాని



## విద్యాశాఖలో ప్రక్షాళన

: లోకేశ్ కీలక ప్రకటనలు, సంస్కరణల వెల్లడి
విద్యావ్యవస్థపై జగన్ తీరును తప్పుబట్టిన మంత్రి లోకేశ్
గత ప్రభుత్వంలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటుకు
టీచర్ల బదిలీల్లోఅవినీతికి పాల్పడ్డారని ఆరోపణ
సీబీఎస్ఈ, ఐబీ, టోఫెల్ అమలుపై జగన్‌వి అసత్య ప్రచారాలు

అమరావతి,**మే31ఆంధ్రప్రగతి**
గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర విద్యావ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిందని, మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రజా జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ విఫలమయ్యారని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జగన్ రెడ్డి ఇప్పటికైనా బాధ్యతగా వ్యవహరించాలని హితవు పలికారు. చిన్నప్పుడే పదో తరగతి పరీక్షా పత్రాలు ఎత్తుకెళ్లిన వ్యక్తి నుంచి మిగతాది 2లో...



## మూల్యాంకనాన్ని నిర్వహించలేని దుస్థితిలో ప్రభుత్వం..

లోకేష్ బాధ్యత తీసుకోవల్సిందే
తుది ఫలితాలువెల్లడించే వరకు అడ్మిషన్లు నిలిపేయండి
మాజీ సీఎం వైఎస్ జగన్ డిమాండ్



అమరావతి, **మే31ఆంధ్రప్రగతి**
ముఖ్యమంత్రిచంద్ర బాబునాయుడు.. విద్యాశాఖ మంత్రి లోకేష్ నిర్వాకానికి టెన్త్ విద్యార్థులు బలికావాలా అని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి మండి పడ్డారు.. శనివారం ఎక్స్ వేదికగా టెన్త్ మూల్యాంకనం నిర్వహణలో జరిగిన తప్పులపై జగన్ ప్రతిస్పందించారు. ముఖ్యమంత్రి చంద్రబానాయుడును ఉద్దేశించి ఇలా ట్వీట్ చేశారు. ఎన్సీబీఎన్ గారూ.. మిగతాది 2లో...

## తెలంగాణ జాగృతి నూతన కార్యాలయం.

ఫ్లెక్సీల్లో ప్రొఫెసర్ జయశంకర్, కేసీఆర్,ఫొటోలు
భర్తతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన కవిత
అంబేద్కర్, పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలు

హైదరాబాద**మే31ఆంధ్రప్రగతి**
హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో తెలంగాణ జాగృతి సంస్థ నూతన కార్యాలయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె తన భర్తతో కలిసి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అయితే, ఈ కార్యక్రమం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. మిగతాది 2లో...



## 15 రోజుల పాటురెండు పూటలా రేషన్ పంపిణీ

పకడ్బందీగా రేషన్ దుకాణాల నిర్వహణ
డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వెల్లడి

అమరావతి,**మే31ఆంధ్రప్రగతి**
చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీని ప్రతిష్టాత్మకంగా చేస్తున్నామని... ఇకపై నెలలో 15 రోజులపాటు రెండు పూటల అందజేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా డిప్యూటీ- సీఎంవో కార్యాలయం ట్వీట్ చేసింది. జగన్ ప్రభుత్వంలో పేదలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకుల చౌక ధరల దుకాణాలను మూసేసి, ఇంటింటికీ అందిస్తాం అంటూ గొప్పలు చెప్పారు కానీ ఆచరించలేదని మండిపడ్డారు. మిగతాది 2లో...



# మూల్యాంకనాన్ని నిర్వహించలేని దుస్థితిలో ప్రభుత్వం..

(మొదటి పేజి తరువాయి)



మీరు, మీ కొడుకు విద్యాశాఖ మంత్రి లోకేష్ టెన్త్ పరీక్షల నిర్వహణలో పూర్తిగా ఫెయిల్ అయ్యారు. మీ పాలనలో విద్యారంగం భ్రష్టుపట్టిపోయింది. మీ అవివేక, అనాలోచిత, పరిణితిలేని నిర్ణయాలతో విద్యా ర్థులకు, వారి తల్లిదండ్రులకు కష్టాలే

ఎదురవుతున్నాయి. 10వ తరగతి పరీక్ష ప త్రాల మూల్యాం కనాన్ని కూడా సరిగ్గా నిర్వహించలేని దుస్థితిలో ఉన్న మీరు, మిగతా వ్యవస్థలను ఇంకా ఎంత ఘోరంగా నడుపుతున్నారో అర్థం అవుతోందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.6.14 లక్షల మంది రాత్రీ పగలూ కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, జవాబు పత్రాలను సరిగ్గా దిద్ది, పారదర్శకంగా ఫలితాలు వెల్లడిం చాల్సిన మీరు ఘోరంగా విఫలమై, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను క్షోభకు గురిచేశారని ధ్వజమెత్తారు.. ఇప్పుడు ప్రతి స్టూడెంట్ తన మార్కుల జాబితాపై అనుమానాలు వ్యక్తంచేసే వ్యక్తంచేసే పరిస్థితిని తీసుకువచ్చారన్నారు. మీరు చేసిన తప్పులు కారణంగా ట్రిపుల్ ఐటీ, గురుకుల జూనియర్ కాలేజీలు సహా ఇతరత్రా అడ్మిషన్లలో విద్యార్థులు అన్యాయమైపోయిన ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. చంద్రబాబుగారూ దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? అసలు పరీక్షల నిర్వ హణ సమయంలోనే మీ బేలతనం బయటపడింది. ప్రశ్నపత్రాలు లీకేజీ అయ్యాయి. అయినాసరే త ప్పులను సరిదిద్దుకోకపోవడం మీ అసమర్థతకు నిదర్శనం కాదా? అని నిలదీశారు. రాష్ట్రంలో చదివే ప్రతి విద్యార్థి ప్రపంచస్థాయిలో పోటీని ఎదుర్కొ నేలా తీసుకొచ్చిన అనేక సంస్కరణలను వచ్చీరా గానే దెబ్బతీశారు. స్కూళ్లలో నాడు-నేడు, గోరు ముద్ద ఇంగ్లీషు మీడియం, 3వ తరగతి నుంచే టోఫెల్ క్లాసులు, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు, 3వ తరగతి నుంచే సబ్జెక్టుల వారీగా బోధన ఇలా ప్రతి మంచి కార్యక్రమాన్ని కక్షగట్టి నీరుగా ర్చారు. తల్లులను ప్రోత్సహిస్తూ ఇచ్చే అమ్మ ఒడినిరద్దు చేశారు. ఇప్పుడు పరీక్షలు నిర్వహణ, ఫలితాల వెల్లడిలోనూ విఫలమవుతున్నారని ఆక్షేపించారు. మీరు చేసిన తప్పుల వల్ల విద్యార్థులు బలైపోవడానికి వీల్లేదు. ఎలాంటి ఫీజు లేకుండా కోరిన ప్రతి విద్యార్థి జవాబు పత్రాలను రీవాల్యుయేషన్ చేయండి. తుది ఫలితాలు వచ్చేంతవరకూ టెన్త్ మార్క్స్ ప్రాతిపదికగా చేస్తున్న అడ్మిషన్లను కొన్నిరోజులపాటు నిలిపివేయండి. తప్పులకు బాధ్యులైన విద్యాశాఖ మంత్రి లోకేష్ మొదలు అందరిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రపంచ సుందరి థాయ్‌లాండ్ యువతి ఓపల్ సుచాత

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రతిష్టాత్మక పోటీలో పోలెండ్ దేశానికి చెందిన యువతులు రెండు ప్రధాన స్థానాల్లో నిలవడం గమనార్హం. ఫస్ట్ రన్నర్ అప్‌గా మిస్ పోలెండ్ నిలవగా, సెకండ్ రన్నర్ అప్‌గా మిస్ పోలాండ్ నిలిచారు. మూడో రన్నర్ అప్‌గా మిస్ మార్టినిక్ నిలిచారు.మిస్ వరల్డ్‌గా ఎంపికైన ఓపల్ సుచాతకు రూ. 8.5 కోట్ల ప్రైజ్ మనీని అందించనున్నారు. సుచాత థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో జన్మించారు.

మే7వ తేదీన ప్రారంభమైన ఈ సందడి నివారణ (మే31న) తుది పోటీలతో ముగిసింది. "బ్యూటీ విత్ ఏ పర్పజ్" నినాదంతో "మిస్ వరల్డ్" పోటీలను 1951లో "ది మిస్ వరల్డ్ అర్గనైజేషన్" మొదలుపెట్టింది. హైదరాబాద్లోని హైటెక్స్ ఈ గ్రాండ్ ఫినాలేకు వేదికైంది. కాగా, భారత్కు చెందిన నందిని గుప్తా టాప్ 20 వరకు వచ్చారు కానీ విజేతగా కాలేకపోయారు. ఫైనల్ రౌండ్లు చేరిన నలుగురు కంటెస్టెంట్లలో మిస్ థాయిలాండ్, మిస్ ఇదియోపియా, మిస్ మార్టినికి, మిస్ హోలెండ్ నిలిచారు. మిస్ థాయ్ లాండ్ ఒపల్ సురాత మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని దక్కించుకున్నారు. "మిస్ వరల్డ్-3035" మొదటి రన్నరప్ గా మిస్ ఐడియోపియా హిస్సెట్ రిజ్ ఆడమాను నిలిచారు. రెండో రన్నరప్ గా మిస్ పోలెండ్ మాజీ క్షాణా. మూడో రన్నరప్ గా మిస్ మార్టినిక్ ఓపీలియా జోచెమ్ నిలిచారు.

**క్యాన్సర్ను జయించి..**

16 ఏళ్లకే క్యాన్సర్ బారిన పడిన సుజాతా దువాంగ్




శ్రీ ముప్పు నుంచి వైద్యంగా బయటపడ్డారు. అప్పటి నుంచి థాయ్లాండ్లో దొమ్ము క్యాన్ససై అవగాహన కల్పిస్తున్నారు. క్యాన్సర్ బాధితులకు అండగా నిలుస్తున్నారు. ఇందుకోసం నిధులు సేకరించడంతోపాటు, కొన్ని సంస్థలతో కలిసి పనిచేస్తున్నారు. ప్రభావితం చూపి లక్ష్యంతో యువత ముందడుగు వేయాలని ఆమె పిలుపునిస్తున్నారు

**మోడల్ నుంచి మిస్ వరల్డ్ దాకా..**

21 ఏళ్ల థాయిలాండ్ సుందరి సురాత చువాంగ్ మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని సొంతం చేసుకుంది. ఈ పురస్కారం పొందిన తొలి థాయ్ యువతిగా రికార్డుకెక్కింది. జననం: 2001 సెప్టెంబర్ 20న సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన సురాత కిరీ మోడల్ గా ప్రారంభమైంది. అక్కడ నుంచి అంది అందాల పోటీలవైపు దృష్టిసారించింది. తొలిసారి 2021లో అందాల పోటీల్లో పాల్గొంది. తల్లిదండ్రులు చిన్న వ్యాపారం నిర్వహిస్తుండేవారు. సుజాత ప్రాథ మిక, సెకండరీ విద్యను కజోన్కిట్సుస్కా స్కూల్లో పూర్తిచేసింది. ప్రస్తుతం పొలిటికల్ సైన్స్లో బ్యాచిలర్ డిగ్రీ చదువుతోంది. 2001లో మొదటిసారి అందాల పోటీలకు సిద్ధమైంది. అయితే ఆ పోటీలలో అమెకు చోటుదక్కలేదు. దీంతో నిరాశ చెందకుండా, మరుసటి ఏడాది. (2022) స్వదేశంలో జరిగిన మిస్ యూనివర్స్ పోటీలలో పాల్గొంది. 18 ఏళ్ల వయసులో మూడవ రన్నరప్ గా నిలిచింది. అయితే మొదటి రన్నరప్ నికోల్నీ రాజీనామాతో ఈమె రెండవ రన్నరప్ గుర్తింపు పొందింది. ఇక గతేడాది బ్యాంకాక్లో జరిగిన మిస్ యూనివర్స్ పోటీ లలో థాయ్లాండు ప్రాతినిధ్యం వహించింది. అనేక ప్రత్యేక అవార్డులు గెలుచుకుంది. మిస్ చార్మింగ్లైంట్ మిస్ బ్యూటీ అండ్ కానివంటి పురస్కారాలు నెగ్గింది చివరగా మిస్ యూనివర్స్ కిరీటాన్ని తలపై బలంకరించుకుంది. ఆ తర్వాత 17 నవంబర్ 2024లో మెక్సికో సిటీ వేదికగా జరిగిన మిస్ యూనివర్స్లో భర్ రన్నరప్ గా నిలిచింది. 125 దేశాల నుంచి అందాల భామలు ఈ పోటీలో పాల్గొన్నారు. తాజాగా హైదరాబాద్ వేదికగా జరిగిన మీస్ వరల్డ్ పోటీల్లోనూ తన అందచందాలకు తోడు, సమయస్ఫూర్తి సేవాదృక్పథాన్ని చాటుతూ కిరీటం సొంతం చేసుకుంది.

# పేదల సంక్షేమమే కూటమి లక్ష్యం

(మొదటి పేజి తరువాయి)

దేశంలో ఎక్కడా ఇలాంటి సౌకర్యం లేదన్నారు. కోనసీమజిల్లాలోని చెయ్యేరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం పర్యటించారు. కాట్రేనికోన మండలం చెయ్యేరులో లబ్దిదారులకు సీఎం పెన్షన్లను పంపిణీ చేశారు. అనంతరం ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఒక రోజు ముందుగానే రాష్ట్రంలో పెన్షన్లు పంపిణీ చేశామని.. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లోనే పెన్షన్లు ఇస్తున్నామని అన్నారు. ఇదీ.. పేదల కోసం ప్రభుత్వం పనిచేసే తీరు అని చెప్పుకొచ్చారు. హామీ ఇచ్చిన ప్రకారం అధికారంలోకి రాగానే పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచామని అన్నారు. 64 లక్షల మందికి ప్రతినెల 1వ తేదీనే పెన్షన్లు అందిస్తున్నామన్నారు.రాష్ట్రంలో ఇప్పటికే 90 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి అయినట్లు వెల్లడించారు. త్వరలో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. రేషన్ వాహనాల పేరుతో అరాచకం చేశారని మండిపడ్డ సీఎం.. జూన్ 1నుంచి రేషన్ షాపుల్లో బియ్యం సరఫరా చేయనున్నట్లు- తెలిపారు. పేరుకు మాత్రమే డోర్ డెలివరీ అని.. ఆ బియ్యాన్ని అక్కడే తీసుకుని కాకినాడ పోర్టుకి ఎగుమతి చేశారని ఆరోపించారు.గత ప్రభుత్వంలో మాఫియా చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రానికి నేర చరితులు వచ్చారని.. దానికి రాజకీయ ముసుగు తొడిగారని వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక ఉగ్రవాదులు సమాజాన్ని అతలాకుతలం చేయాలని అనుకుంటున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం పేదలకు కనీవినీ ఎరుగని రీతిలో సహాయం చేసిందన్నారు. రూ.34 వేల కోట్లు- పింఛన్ల కోసం ఇచ్చామని తెలిపారు. దేశంలో ఎక్కడా తమ ప్రభుత్వం ఇచ్చినట్లు- పెన్షన్లు ఇవ్వడం



లేదని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పేదల కోసం ఆలోచించాలన్నారు. భగవంతుడు కనికరిస్తే భవిష్యత్తులో పింఛన్లు పెంచుతామని ప్రకటించారు. గత వైసీపీ ప్రభుత్వం వితంతు పింఛన్లు ఇవ్వలేదని.. తాము వచ్చాక 71,380 మందికి పెన్షన్ ఇచ్చామన్నారు. ధనిక రాష్ట్రం మహారాష్ట్రలో పెన్షన్ రూ. 1000, తెలంగాణలో రూ.2500 మాత్రమే పింఛన్లు ఇస్తున్నారన్నారు. అధిక పెన్షన్ ఇచ్చే ఏ-కై-క రాష్ట్రం ఏపీ అని తెలిపారు. 3 నెలల పెన్షన్ ఒకేసారి తీసుకునే అవకాశం ఇచ్చామన్నారు. మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 5 లక్షల మంది వర్క్ ఫ్రమ్ హోమ్ కింద ఉద్యోగం చేస్తున్నారని తెలిపారు. ఉచిత సిలెండర్ల కోసం నాలుగు నెలలకోసారి అకౌంట్‌లో డబ్బులు జమ అవుతున్నాయన్నారు. రూ.1200 కోట్లతో రాష్ట్రంలో రోడ్లు రిపేర్ చేశామన్నారు. 203 అన్నా క్యాంటీ-న్లో భోజనం అందిస్తున్నామన్నారు. రూ.1674 కోట్లు- పాత ధాన్యం బకాయిలు చెల్లించామని తెలిపారు.

నియోజకవర్గంలో 10 వేల సోలార్ కనెక్షన్లు ఏర్పాటు- చేయకపోతే ఎమ్మెల్యే పవర్ కట్ చేస్తామని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్ చాలా ప్రమాదకరమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో విచ్చల విడిగా లభ్యమయ్యాయని మండిపడ్డారు. శాటిలైట్ డ్రోన్స్ ద్వారా గంజాయి నిర్మూలన చేస్తున్నామన్నారు. స్కూళ్లు తెరిచేలోగా ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని మరోసారి స్పష్టం చేశారు. దేశంలో దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తగ్గిపోయిందని.. రాష్ట్రంలో జనాభా పెరగాలన్నారు. జూన్ నుంచి అన్నదాత సుఖీభవ అమలు చేయనున్నట్లు- తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలులోకి తీసుకురానున్నట్లు- చెప్పారు. కడప మహానాడులో తన జీవితంలో చూడని స్పందన చూశానని అన్నారు. ఎప్పటికీ ఈ ప్రభుత్వాన్ని నిలబెట్టు- కునే బాధ్యత ప్రజలదే అని చెప్పారు. మరో రెండు నెలల్లో అన్ని ప్రభుత్వ సేవలు వాట్సాప్ గవర్నెన్స్‌లో అందుబాటులోకి వస్తాయన్నారు. కోనసీమలో 1996 తుఫాన్ బీభత్స రోజులను గుర్తు చేసుకున్న సీఎం.. నాడు తాను స్వయంగా చేపట్టిన సహాయక చర్యల గురించి వివరించారు. అందరికీ సామాజిక న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఎవరికీ అన్యాయం జరగకుండా వర్గీకరణ చేస్తామని.. భవిష్యత్తులో జిల్లాల స్థాయిలోనూ రిజర్వేషన్లు ఉంటాయన్నారు. రాజకీయాలు చేస్తూ తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. బాబాయి హత్యలోనూ రాజకీయం చేశారని... ఇప్పుడు కూడా అలాగే చేయాలని అనుకుంటు-న్నారని మండిపడ్డారు. టీ-టీ-డీలో అరాచకాలు చేస్తూ ప్రభుత్వం ఫెయిల్ అయిందని చెప్పాలని చూశారని.. - టె-క్నాలజీ వాడి తప్పులు బయటకు తీస్తామని వార్నింగ్ ఇచ్చారు. రాయలసీమలో ఎన్నికలు వస్తే బాంబులు అడిగేవారని.. ఇప్పుడు ముఠాలు లేవన్నారు. కోనసీమలో అంబేద్కర్ విగ్రహాలను దెబ్బ తీస్తూ.. విగ్రహాల రాజకీయం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. కోనసీమ అనంతపురం కంటే వెనుకబడిపోయిందని అన్నారు.

# విద్యాశాఖలో ప్రక్షాళన

(మొదటి పేజీ తరువాయి)

హుందాతనం ఆశించడం తమ తప్పేనని ఎద్దేవా చేశారు. యూనిఫాం నుంచి చిక్కీల వరకు అన్నింటికీ పార్టీ రంగులు, ఆయన పేరు తగిలించుకుని ఇప్పుడు విలువల గురించి మాట్లాడటం జగన్‌కే చెల్లిందని లోకేశ్ దుయ్యబట్టారు.గత ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాల వల్ల విద్యారంగం తీవ్రంగా నష్టపోయిందని లోకేశ్ ఆరోపించారు. "ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీని రద్దు చేసిన మీరు విద్యావ్యవస్థ గురించి మాట్లాడటమా? అధికారంలో ఉన్నప్పుడు ఉపాధ్యాయులను మద్యం దుకాణాల ముందు కాపలా పెట్టి, ఇప్పటికీ వారి పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు" అని లోకేశ్ ఆరోపించారు.జీవో 117 వంటి నిర్ణయాల వల్ల ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 12 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు తరలిపోయారని తెలిపారు. ఉపాధ్యాయులను, విద్యార్థులను సన్నద్ధం చేయకుండానే వెయ్యి పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెట్టారని, తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టాక నిర్వహించిన పరీక్షల్లో 90 శాతం మంది విద్యార్థులు విఫలమయ్యారని గుర్తుచేశారు. పదో తరగతి ఫెయిల్ అయితే, ముఖ్యంగా ఆడపిల్లల చదువు ఆగిపోయి, వివాహాలు చేసే ప్రమాదం ఉందని, అందుకే సీబీఎస్ఈ విధానాన్ని ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని వాయిదా వేశామని వివరించారు.జగన్ రెడ్డి ఐబీ విధానం తెచ్చానని కలలు కంటున్నారని, దాని అమలు నివేదిక కోసం రూ.5 కోట్లు ఖర్చు చేశారే తప్ప అమలు చేయలేదని లోకేశ్ విమర్శించారు. టోఫెల్ చెప్పే ఉపాధ్యాయులు లేకుండానే అమలు చేశానని గొప్పలు చెప్పుకోవడం ఆయనకే చెల్లిందన్నారు. రూ.4500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, గుడ్ల నుంచి చిక్కీల వరకు రూ.1000 కోట్ల బకాయిలను తమ ప్రభుత్వంపై మోపి వెళ్లారని ఆరోపించారు. జగన్ హయాంలో ఉపాధ్యాయుల బదిలీల కోసం నాటి మంత్రి డబ్బులు వసూలు చేయడం బహిరంగ రహస్యమని, ఉన్నత విశ్వవిద్యాలయాలను రాజకీయ కేంద్రాలుగా మార్చి వికృత క్రీడ ఆడారని దుయ్యబట్టారు. గ్రూప్-1 వంటి కీలకమైన ప్రశ్నపత్రాలను హైలాండ్ లాంటి ప్రైవేటు రిసార్టులో వాచ్‌మెన్లతో దిద్దించింది జగన్ కాదా? అని ప్రశ్నించారు.ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగ ప్రక్షాళనకు కట్టుబడి ఉందని లోకేశ్ స్పష్టం చేశారు. "మీరు భ్రష్టు పట్టించిన వ్యవస్థను గాడిన పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నాను. టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్ ద్వారా రాజకీయాలకు అతీతంగా ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ చేపడుతున్నాం. కేజీ నుంచి పీజీ వరకు పాఠ్య ప్రణాళిక మారుస్తున్నాం. ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడు లక్ష్యంగా పని చేస్తున్నాం. పుస్తకాల బరువు తగ్గించాం, విలువలతో కూడిన విద్య అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం" అని తెలిపారు.విద్యార్థులకు అందించే కిట్ల నుంచి అనేక పథకాలకు మహనీయుల పేర్లు పెట్టామని, ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి ప్రారంభించామని చెప్పారు. విశ్వవిద్యాలయాల పనితీరు మెరుగుపరిచేందుకు ఉత్తమ వ్యక్తులను వైస్ ఛాన్సలర్లుగా నియమిస్తున్నామని వివరించారు.పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంపై వస్తున్న ఆరోపణలను లోకేశ్ ఖండించారు. ఈ ఏడాది 45,96,527 జవాబు పత్రాలను మూల్యాంకనం చేయగా, రీ-కౌంటింగ్/రీ-వెరిఫికేషన్ తర్వాత 11,175 జవాబు పత్రాల్లో మాత్రమే మార్కుల్లో వ్యత్యాసం వచ్చిందని, ఇది కేవలం 0.25 శాతం మానవ తప్పిదమని, 99.75 శాతం కచ్చితత్వంతో మూల్యాంకనం జరిగిందని వివరించారు. ఈ ఏడాది 34,709 మంది విద్యార్థులు 66,363 స్క్రిప్టుల రీ-కౌంటింగ్/రీ-వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా, 10,159 మంది విద్యార్థులకు చెందిన 11,175 స్క్రిప్టులలో (16.8 శాతం) వ్యత్యాసాలు గుర్తించి సరిచేశామని, బాధ్యులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు.జగన్ హయాంలో 2022లో 20 శాతం, 2023లో 18 శాతం, 2024లో 17 శాతం స్క్రిప్టులలో వ్యత్యాసాలు వచ్చాయని, ఆ వివరాలు బయటపెట్టే ధైర్యం కూడా చేయలేదని విమర్శించారు. ఈ వాస్తవాలను మరుగునపెట్టి తమపై బురద చల్లడం సిగ్గుచేటన్నారు. రీ-వెరిఫికేషన్‌లో తేడాలు గుర్తించిన విద్యార్థులకు ఆర్జేయూకేటీలలో అడ్మిషన్లకు జూన్ 10 వరకు అవకాశం కల్పించామని, ఇతర అడ్మిషన్ల విషయంలోనూ సమయం ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు.

## 15 రోజుల పాటురెండు పూటలా రేషన్ పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

రూ.1600 కోట్లతో వాహనాలు కొనుగోలు చేసి, ఇంటింటికీ ఇవ్వడం మానేసి నెలలో ఒకటి నుంచి రెండు రోజులు మాత్రమే జంక్షన్లలో వాహనం నిలిపి ఇచ్చారని పేర్కొన్నారు.

ఎంతోమంది పేదలకు ఆ సరుకులు అందక ఇబ్బందులుపడ్డారని పవన్ కల్యాణ్ తెలిపారు. ఆ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక రోజువారీ పనులు మానుకొని, చిరుద్యోగాలకి సెలవు పెట్టుకోవాల్సి వచ్చేదని వెల్లడించారు. మిగిలిన రేషన్ బియ్యం, సరుకులను అక్రమంగా తరలిస్తున్న విషయంపై సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపిందని వివరించారు. వేలాది టన్నుల అక్రమ బియ్యాన్ని తమ ప్రభుత్వం కాకినాడ, విశాఖపట్నం పోర్టుల్లో పట్టుకుందని గుర్తుచేశారు పవన్ కల్యాణ్. రేషన్ సరఫరాలో అక్రమాలను అరికట్టేందుకు, ప్రతీ పేద కుటుంబానికి రేషన్ సరుకులు అందించేందుకు ఇకపై ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు.. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు.. అలాగే సాయంత్రం 4గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ డీలర్ల దుకాణాల వద్ద అందజేస్తామని తెలిపారు. దీని ద్వారా రద్దీని తగ్గించడమే కాకుండా, ప్రతీ ఒక్క కుటు-ంబానికి అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే దివ్యాంగులకు, 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించే సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పించిందని వెల్లడించారు. ఈ సదుపాయాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జనరంజకంగా అమలవుతుందని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

## గోశాలల అభివృద్ధికి ప్రత్యేక కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, గోశాలల ఏర్పాటుకు సంబంధించి ఒక ప్రత్యేక కమిటీని నియమించాలని ఆయన సూచించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టిన గోశాలకు సంబంధించిన డిజైన్లను రాబోయే నాలుగైదు రోజుల్లోగా ఖరారు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ ప్రతిపాదిత కమిటీ, గోశాలల ఏర్పాటుకు సంబంధించిన అన్ని అంశాలపై లోతైన అధ్యయనం చేసి, నిర్దేశిత గడువులోగా సమగ్రమైన, పూర్తిస్థాయి ప్రణాళికను ప్రభుత్వానికి సమర్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తొలి విడతలో భాగంగా, పశుసంవర్ధక, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలలు, అలాగే దేవాలయాలకు చెందిన అందుబాటులో ఉన్న భూముల్లో ఈ ఆధునిక గోశాలలను ఏర్పాటు చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.నిర్మించబోయే గోశాలలు కేవలం గోవులను ఇరుకు ప్రదేశాల్లో బంధించినట్లుగా ఉండరాదని, అవి స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా, అన్ని రకాల అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇందుకోసం, ప్రతి గోశాలను కనీసం 50 ఎకరాల విశాలమైన స్థలంలో ఏర్పాటు చేసేలా అనువైన భూములను గుర్తించాలని ఆయన ఆదేశించారు. అంతేకాకుండా, ఈ గోశాలల సమర్థవంతమైన నిర్వహణ కోసం ధార్మిక సంస్థలు, సేవా సంఘాలను భాగస్వాములను చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

## తెలంగాణ జాగృతి నూతన కార్యాలయం.

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు పలువురి దృష్టిని ఆకర్షించాయి. ఈ ఫ్లెక్సీలపై తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మరియు ఎమ్మెల్సీ కవిత చిత్రపటాలు మాత్రమే కనిపించాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇతర ముఖ్య నేతల ఫొటోలు ఎక్కడా లేకపోవడం గమనార్హం.గత కొంతకాలంగా ఎమ్మెల్సీ కవిత త్వరలో సొంతంగా ఒక రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నారని, ఆ పార్టీ జెండా పాలపిట్ట రంగులో ఉండనుందనే ప్రచారం తెలంగాణ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఈ ప్రచారానికి బలం చేకూర్చే విధంగా, నేటి తెలంగాణ జాగృతి కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కవిత పాలపిట్ట రంగు చీర ధరించి హాజరుకావడం గమనార్హం. అయితే కొత్త పార్టీ ప్రచారాన్ని కవిత ఇదివరకే ఖండించారు.తెలంగాణ జాగృతి బ్యానర్‌లో ఆచార్య జయశంకర్, కేసీఆర్, కవిత ఫొటోలను పెట్టారు. కొత్త కార్యాలయంలో బి.ఆర్. అంబేద్కర్, ఆచార్య జయశంకర్, తెలంగాణ తల్లి, జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలతో పాటు అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేశారు.

## నారీశక్తి ఏమిటో పాక్‌కు చాటి చెప్పాం

'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రవాదులే కాకుండా, వారిని పోషించేవారు కూడా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని భారత్ ప్రపంచానికి స్పష్టం చేసిందని ప్రధాని పేర్కొన్నారు. ఆ సమయంలో భారతీయ మహిళల శక్తిసామర్థ్యాలను ప్రపంచమంతా చూసిందని ఆయన గుర్తుచేశారు. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం, భారత సరిహద్దు రాష్ట్రాలపై పాకిస్థాన్ దాడులు జరిపినప్పుడు, అసిస్టెంట్ కమాండెంట్ నేహా భండారి నేతృత్వంలోని బీఎస్ఎఫ్ మహిళా బృందం అఖ్నూర్‌లోని ఫార్వర్డ్ పోస్టుల వద్ద మూడు రోజుల పాటు వీరోచితంగా పోరాడిందని ప్రధాని కొనియాడారు."మన సంప్రదాయంలో 'సిందూర్' 'నారీశక్తి'కి చిహ్నం. పహల్గామ్‌లో, ఉగ్రవాదులు కేవలం మన పౌరుల రక్తం మాత్రమే చూడలేదు, మన సంస్కృతిపై దాడి చేశారు. మన సమాజాన్ని విభజించడానికి ప్రయత్నించారు. ఉగ్రవాదులు భారత నారీశక్తికి విసిరిన సవాలే వారి పాలిట, వారిని పోషిస్తున్న వారి పాలిట శాపంగా మారింది. పాకిస్థాన్ సైన్యం కూడా ఊహించని ప్రాంతాల్లో ఉగ్రవాద శిబిరాలపై మన సాయుధ దళాలు దాడులు చేశాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం చేపట్టిన ఈ ఆపరేషన్ భారత చరిత్రలోనే అతిపెద్ద విజయం" అని వ్యాఖ్యానించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 1 జూన్ 2025

# ఇలకైలాసమైన శ్రీశైలంలో యోగాంధ్ర కార్యక్రమాలు

## ఆరోగ్యం -ఆధ్యాత్మిక సాధనకు యోగ ప్రధాన ప్రక్రియ

**ప్రతి ఒక్కరు యోగ క్రియలను అనుసరించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోండి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





**ఆంధ్ర ప్రగతి శ్రీశైలం/నంద్యాల, మే 31:**
రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న యోగాంధ్ర కార్యక్రమంలోలో ప్రతి ఒక్కరు భాగస్వాములై ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శనివారం శ్రీశైల మహాక్షేత్రంలోని గంగాధరమండపం నుండి నంది సర్కిల్ వరకు 1500 మందిచే నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, శ్రీశైలనియోజకవర్గం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు తదితరులు జ్యోతిప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ యోగా గురువు గంధవళ్ళ బాలసుబ్రహ్మణ్యం కార్యక్రమములో యోగాను చేయించారు. ప్రముఖ సంస్కృత పండితులు డా. దీవి హయగ్రీవాచార్యుల వారు కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సంప్రదాయ నృత్యంతో యోగా కార్యక్రమం నిర్వహించబడింది. చిరంజివి గంధవళ్ళ రాధా రమణి గణపతి ప్రార్ధన, సరస్వతి ప్రార్ధన, శివస్తోత్రాలకు సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21వ తేదీన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 21 నుంచి జూన్ 21 వ తేదీ వరకు నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా యోగ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా యోగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలలోని అయిదు పర్యాటక ప్రదేశాలలో యోగ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం సూచించిన మేరకు శనివారం ఇలకైలాస సన్నిధిలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా 1500 మందితో యోగ నిర్వహించుకున్నామన్నారు. ఇందులో భాగంగానే జూన్ 7వ తేదీ మహానంది దేవస్థానంలో, 13వ తేదీ బెలుంగుహలు, 18వ తేదీన అహోబిలం, 20వ తేదీన పచ్చర్ల జంగిల్ క్యాంపులో యోగ కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలలో యోగ శిక్షకులను తయారుచేసి జిల్లా వ్యాప్తంగా 8 లక్షల మందికి యోగ నేర్పించి, అంతర్జాతీయ యోగా కార్యక్రమములో పాల్గొనేందుకు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 2014లో ఐక్యరాజసమితి భారతదేశంలో పుట్టిన యోగాను జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగాదినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటి వరకు 170 దేశాలలో యోగ ప్రక్రియలను అవలంభిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో యోగా దినచర్యలో భాగమై ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు చిహ్నం కావాలని ఆకాంక్షించారు. జిల్లాలో ఈశాన్య భాగమైన శ్రీశైలమహాక్షేత్రంలో మొట్టమొదటి యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. నాట్యానికి, యోగానికి అధిదేవుడు పరమశివుడేనని, శివసన్నిధిలో యోగాభ్యసనాలు చేస్తే భగవంతుడి నిండైన ఆశీస్సులు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. యోగాగురువు యోగాంశాలను వివరిస్తూ అందరిచేత యోగాసనాలు చేయించడం సంతోషదాయకరమని కలెక్టర్ తెలిపారు. ఆరోగ్యకరమైన జీవితం, సుఖసంతోషాలు, బాధల నుండి విముక్తి, మానసిక ప్రశాంతత మొదలైనవన్నీ యోగసాధన ద్వారా పొందవచ్చునని తెలిపారు. యోగా వలన శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఎన్నో మంచిఫలితాలు పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈనెల 16వ తేదీన నంద్యాల పట్టణంలో దాదాపు 10 వేల మంది ఉద్యోగులు, సిబ్బందిచే యోగాసనాలు అభ్యసించేందుకు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 75 సంవత్సరాలు నిండిన వృద్ధులకు కూడా మూడు ప్రదేశాలలో యోగాసనాలు చేయించేందుకు కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. జూన్ 21వ తేదీన దాదాపు 8 లక్షల మందితో యోగ కార్యక్రమంలో భాగస్వాములు చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ తెలిపారు.

శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పెద్ద ఎత్తున నెలరోజులపాటు యోగ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయన్నారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ సూచనల మేరకు శ్రీశైల క్షేత్రంలో యోగ కార్యక్రమం నిర్వహించి విజయవంతం చేశామన్నారు. యోగాచార్యులు 1500 మంది అభ్యాసకులకు చక్కగా యోగా నేర్పించారన్నారు. యోగ కార్యక్రమములో పాల్గొన్న ప్రతి ఒక్కరు ప్రతీరోజు అరగంట సమయం కేటాయించి యోగా చేసి ఆయుషును పెంచుకోవాలన్నారు. తాను కూడా ప్రతీరోజు యోగాభ్యసనాలు నిర్వహించి ఆయుషును పెంచుకుని ప్రజలకు మరిన్ని సేవలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ మాట్లాడుతూ యోగా కార్యక్రమంలో నిర్వహించే యోగా ప్రక్రియను అనుసరించాలని సూచించారు. జూన్ 21వ తేదీ నిర్వహించే అంతర్జాతీయ యోగాదినోత్సవానికి జిల్లా తరుపున అత్యధిక మంది యోగాభ్యసనాలు చేసేందుకు అన్నిస్థాయిల్లో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. ఈ మెగా యోగాంధ్ర కార్యక్రమములో పాల్గొన సాధకులకు అభినందించారు. అనంతరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం, స్థానిక శాసనసభ్యులు పర్యాటక ప్రదేశాలలో మొదటి యోగ కార్యక్రమాన్ని శ్రీశైలదేవస్థానములో నిర్వహించడానికి అవకాశం కల్పించడం ఎంతో సంతోషదాయకమన్నారు. యోగా అనేది మన సంస్కృతిలో అనాదిగా ఆచరణలో ఉందన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయన్నారు. శాసనసభ్యులు సూచించినట్లుగా దేవస్థానం తరుపున యోగా శిక్షకులను ఏర్పాటు చేసి ప్రతీరోజు కూడా సిబ్బందికి, స్థానికులకు మరియు యాత్రికులకు యోగాపై శిక్షణను నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా యోగా అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించడం జరిగిందన్నారు. యోగా గురువు గంధవళ్ళ బాలసుబ్రహ్మణ్యం ప్రతి ఆసనానికి వివరణ ఇస్తూ యోగాపరమైన అంశాలను ఆధునిక వైద్య విజ్ఞానంతో అనుసంధానం చేస్తూ ఆయా విశేషాలను, యోగావలన కలిగే ప్రయోజనాలను వివరిస్తూ అభ్యాసకులచే యోగాసనాలు చేయించారు. శారీరక ఆసనాలు, శ్వాసపై ధ్యాస, ధ్యానం, ప్రాణాయామం మొదలైవన్నీ యోగాలోని ప్రధాన క్రియలు అని తెలిపారు. కార్యక్రమములో సూక్ష్మవ్యాయమం, వృక్షాసనము, వక్రాసనము, ఉత్తాన పాదాసనము, పవనముక్తాసనము, అర్ధహలాసనము, శలభాసనము, పాదహస్తానము,దండాసనము మొదలైన ఆసనాలను వేయించారు. కపాలభాతి, అనులోమ విలోమ, శీతలి, భ్రామరి మొదలైన విధానాలతో ప్రాణాయామం చేయించారు. చివరగా శాంతిమంత్రాలతో ఈ యోగా కార్యక్రమం ముగించారు. ఈ కార్యక్రమములో పలువురు జిల్లా అధికారులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, శివసేవకులు, స్థానిక చెంచు గిరిజనులు, యాత్రికులు తదితరులు పాల్గొన్నారు.









# ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ చేసిన మంత్రి ఫరూక్

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 31:**
నంద్యాల టౌన్ 10 వ వార్డు నశం వీధిలో బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందు నాయుడు ఆధ్వర్యంలో లబ్ధిదారుకు స్వయంగా ఇంటింటికి వెళ్లి రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ పింఛన్ పంపిణీ చేసినప్పుడు లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం కనిపించిందని అన్నారు . 200 రూపాయలు ఉన్న పెన్షన్ వేయి రూపాయలు చేసిన ఘనత చంద్రబాబు కే దక్కిందని అన్నారు ... అదేవిధంగా 1000/- రూపాయలు ఉన్న పెన్షన్ 2000/- చేసిన ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని అన్నారు. గత ప్రభుత్వంలో 2000 ఉన్న పెన్షన్ ని 3000 పెంచుతూ ఐదు సంవత్సరాలు గడిపిన వైయస్ జగన్మోహన్ రెడ్డి మాట తప్పారని,ఏట 250/-రు పెంచుతూ ప్రజలను నమ్మకద్రోహం చేశారని, టిడిపి అధికారం చేపట్టిన వెంటనే అధినేత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన మాట



ప్రకారం 3000/- రు పెన్షన్ ని 4000 పెంచుతూ అదేవిధంగా మూడు నెలల ముందే ప్రతి నెల 1000 రూపాయలు చొప్పున మొత్తం కలిపి 7000 రూపాయలు అధికారం చేపట్టిన మొదటి నెలలోనే పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. అలా ప్రతినెల 1వ తేదీనే పింఛన్ ఇవ్వడం జరుగుతుందని అలాగే ఒకటవ తేదీ ఆదివారం వస్తే 31వ తేదీనే వారికి పింఛన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా రేపు జూన్ 1 వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందే అంటే ఈరోజు 31 మే 2025 వ తేదీన నంద్యాల నశం వీధిలో పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. అలాగే నంద్యాలలో అన్ని వార్డులలో, అన్ని గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు దగ్గరుండి లబ్ధిదారులకు పింఛన్ అందజేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు . అనంతరం పింఛన్ లబ్ధిదారులకు అల్పాహార విందును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నంద్యాల ఇంచార్జి కమిషనర్ వెంకట దాస్ , టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏవిఆర్ ప్రసాద్ , నంద్యాల టిడిపి పట్టణ అధ్యక్షులు మునియార్ ఖలీల్ , 19 వ వార్డు టిడిపి ఇంచార్జి షేక్ మున్నా , 15 వార్డ్ టీడీపీ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు అజ్మీర్ , మిద్దె హుస్సేన్, 10 వార్డ్ టీడీపీ నాయకులు ఫయాజ్, ఆసిఫ్, సమీయుల్లా , హుస్సేన్ వాలి, మాభాష , జాకీర్ మరియు మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, ప్రజలలు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డే ఓబన్న విగ్రహ ప్రతిష్టలు విజయవంతం చేయాలి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 31:** తొలితరం స్వాతంత్ర సమరయోధుడు శ్రీ వడ్డే ఓవన్న విగ్రహం ప్రతిష్ట అందరూ ఐకమత్యంతో విజయవంతం చేయాలని ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి చెల్లా వెంకటేష్ శనివారం నాడు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ధర్మవరం పట్టణంలో వడ్డెర సంగం కార్యాలయము నందు జూన్ రెండవ తేదీ వడ్డే ఓబన్న విగ్రహం ప్రతిష్టను ధర్మవరం పట్టణంలోని సిరి పెన్షన్ ఆఫీసు నందు రెండవ తారీకు జూన్ సోమవారం నాడు ఉదయం 9 గంటలకు కుల సోదరులు సోదరీమణులు హాజరై విజయవంతం చేయాలని అన్నారు. తొలి స్వాతంత్ర సమరయోధుడు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా భారతదేశం నుంచి బ్రిటిష్ పాలకులను తరిమి వేయడానికి దాదాపుగా వందల సంఖ్యలో సైన్యం ఏర్పాటు చేసుకొని బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసినటువంటి తొలి స్వాతంత్ర తరం సమరయోధులు వడ్డే ఓబన్న ని తెలిపారు. అటువంటి గొప్ప నాయకుడు స్వాతంత్ర సమరయోధుడు వడ్డెర వంశంలో పుట్టడం చాలా గౌరవ కరువమని తెలిపారు ఆయన ఆశయాలను అందరూ కలిసి పోరాటాలు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వడ్డెర సోదరీ సోదరీమణులు ధర్మవరంలో ఉన్నటువంటి మరియు ప్రజా సంఘాల నాయకులు అందరూ కూడా పాల్గొని వడ్డే ఓబన్న విగ్రహం ప్రతిష్టను జయప్రదం చేయాలని వారు అందరినీ కోరారు.

# మరో ఆత్మబంధు అంత్యక్రియలు నిర్వహించిన ద్రోణాచలం సేవా సమితి.



ఆంధ్ర ప్రగతి డోన్ మే 31: డోన్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో యాచించుకుంటూ తిరుగుతున్న ఒక వ్యక్తి డోన్ రైల్వే స్టేషన్ నాలుగో ప్లాట్ఫారం రైల్వే బ్రిడ్జి పైన అనాధ గా చనిపోతే రైల్వే జి ఆర్ పి పోలీసులు చనిపోయిన వ్యక్తికి డోన్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అతని అంత్యక్రియలు మీరే చేయండి అని ద్రోణాచలం సేవా సమితికి కోరగా స్పందించిన సేవా సైనికులు ఆ మృతదేహాన్ని తీసుకొని డోన్ హిందూ స్మశాన వాటికలో హిందూ సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి అయిన ఖర్చును ప్రొద్దుటూరుకు చెందిన కీర్తిశేషులు వై. నారాయణరెడ్డి కుమారుడు చరణ్ తేజ రెడ్డి భరించారు ఈ కార్యక్రమంలో ద్రోణాచలం సేవా సైనికులు షాదిఖానా రాజా,గురుస్వామి తాహెర్ బాషా, ఉదయ్ కిరణ్, రైల్వే జి ఆర్పీ పోలీసులు శివప్రసాద్, తాహేర్ అహమ్మద్ గార్లు పాల్గొన్నారు. ద్రోణాచలం సేవా సమితి ఆధ్వర్యంలో ఇది 113వ ఆత్మబంధు అంత్యక్రియ

# నిత్యతృప్తిని కలిగించేది భగవద్భక్తియే.

## -డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, తితిదే.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 31:**
దైవభక్తి దేహభ్రాంతిని తొలగించి, శాశ్వతుడైన పరమాత్మ జ్ఞానమును గుర్తింపజేసి, అశాశ్వతమైన దేహముపై ఉన్న భ్రాంతిని అంతమొందిస్తుందని, మనస్సులో నిర్మలమైన భావములను పెంపొందింపచేసి, నిత్యతృప్తిని కలిగిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండలం, బ్రాహ్మణ కొట్కూరు గ్రామంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం నందు గత ఐదు



రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో వారు ప్రవచించారు. అంతకు ముందు గోమాతను పురవీధులగుండా మేళతాళాలతో ఊరేగించారు. తదనంతరం పురోహితులు జంద్యాల వీరప్రసాద్ శర్మచే సామూహిక కుంకుమార్చనలు, గోమాతకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి మఠం నిర్వాహకులు డేగ శ్రీనివాసులు, కొన్రెడ్డి మల్లీశ్వరి, నాగార్జున రెడ్డి, శ్రీ రామకృష్ణ సేవా ఆశ్రమం నిర్వాహకులు యం. తిరుమలయ్య, ధర్మప్రచారమండలి సభ్యులు ఎ. శివశంకర రెడ్డి, యం. హైమావతి, వి. భాగ్యమ్మ, బి. కృష్ణవేణి, బి. లలిత, వి ప్రమీల, వి. కళావతమ్మ, కమ్మరి కృష్ణమూర్తి ఆచారి, కృష్ణాచారి, శంకరాచారి, జనార్ధనాచారి, మఠం సేవకులు డి. ఆదినారాయణ, నరేశ్ బాబు, గోవర్ధనమ్మతో పాటు స్థానిక భక్త సమాజం పాల్గొన్నది.

## బ్రిడ్జి నిర్మాణం పనులను పరిశీలించిన మంత్రి బీసీ.





**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె మే 31:** పాణ్యం సమీపంలోని బనగానపల్లె పాణ్యం రోడ్డులో వద్దెల వాగుపై కొనిదేడు వద్ద జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.బ్రిడ్జి నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించి, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు.బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి, ప్రజా రవాణాకు ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలని మంత్రి బిసి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి అలైన్ మెంట్ ను చెక్ చేసి, అధికారులకుమంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పలు సూచనలు చేశారు. వచ్చే వర్షాకాలంలోపు బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని అదే సమయంలో నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మంత్రి మంత్రి బీసీ సూచించారు.

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ

# చట్టాన్ని నిర్వర్యం చేయొద్దు



**ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు మే 31:**నంద్యాల జిల్లా మిడుతూరు మండలం పీరు సాహెబ్ పేట గ్రామ లోని ఉపాధి హామీ పనులను సందర్శించిన వామపక్ష పార్టీలైన లిబరేషన్ పార్టీల నాయకులు కూలీలతో చట్టం పై అవగాహన కల్పించడం జరిగింది ఈ సందర్భంగా భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) జిల్లా కన్వీనర్ పాతకోట లాజరస్ సిపిఐ ఎంఎల్ (లేబరేషన్) పార్టీ జిల్లా నాయకులు పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2005లో వామపక్ష పార్టీల బలముతో యూపీఏ ప్రభుత్వం కూలీల వలస నివారణకై ఉపాధి హామీ చట్టం వచ్చినదని నేడు కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వర్యం చేస్తున్నారని ఈ చట్టాన్ని కూలీలే కాపాడుకోవాలని ఉపాధి హామీ చట్టం కొరకు పోరాటాలు చేసి పెండింగ్ ఏడు వారాల. పెండింగ్ బిల్లు ను తక్షణమే మంజూరు చేయాలి రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని ఆందోళన చేయాలని వారు కూలీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం సి పి ఐ యు డివిజన్ కార్యదర్శి లింగాల శ్రీనివాసులు జిల్లా నాయకులు మరి స్వామి.లిబరేషన్ పార్టీ నాయకులు కాంటిపోగుస్వామన్న ఉపాధి శ్రామికులు మల్లేశ్వరమ్మ పాపులమ్మ వెంకట లచ్చమ్మ వరలక్ష్మి శ్యాంశంబి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధులను అనుక్షణం స్మరించుకోవాలి.

### -సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి



**ఆంధ్ర ప్రగతి డోన్ మే 31:** స్వాతంత్ర్య సమర యోధురాలు దువ్వూరి సుబ్బమ్మ వర్ధంతి సందర్భంగాడోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న తొలి ఆంధ్ర మహిళ శ్రీ దువ్వూరి సుబ్బమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూలిమన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.దేశ బాంధవి దువ్వూరి సుబ్బమ్మ 1880 లో జన్మించారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళిన మొట్టమెదటి ఆంధ్ర మహిళ. సమాజసేవిక, స్త్రీ జనోద్ధరణకు కృషి చేసిన మహనీయురాలు. ఈమె స్వాతంత్ర్యోద్యం వైపు అడుగులు వేసి కాకినాడలో జరిగిన రాజకీయ సమావేశంలో పాల్గొని సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని లక్ష్యంగా బలపరుస్తూ అనర్గళంగా మాట్లాడింది. ఈమె 1922 సంవత్సరంలో సహాయనిరాకరణోద్యమంలో ప్రముఖ పాత్ర వహించింది. అంతే కాకుండా ఈమె ఉప్పు సత్యాగ్రహం, క్విట్ఇండియా ఉద్యమాలలో పాల్గొన్నది. 1964 సంవత్సరం మే 31 తేదీన ఈమె పరమపదించింది.ఇలాంటి మహనీయులను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.

## నంద్యాల పట్టణంలోని ఇల్లు లేని

# నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 31:** జూన్ 2వ తారీకు నంద్యాలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె రామకృష్ణ వచ్చి ఇంటి స్థలాలకు అర్జీలు పెట్టిన వారి తరఫున అధికారులతో మాట్లాడడం జరుగుతుంది కనుక అర్జీదారులు అందరూ జూన్ రెండవ తారీకు ఉదయం 10 గంటలకు టేక్కే మార్కెట్ యార్డ్ దగ్గరికి రావాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్, నందమూరి నగర్ అర్జీదారులతో సిపిఐ సీనియర్ నాయకులు సలాం ఖాన్ విసి కాలనీ అర్జీదారులతో .మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి విశ్వ నగర్ అర్జీదారులతో, సిపిఐ గోసు పాడు మండల కార్యదర్శి హరినాథ్ వివేకానంద కాలనీ అర్జీదారులతో . మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ బాలాజీ కాంప్లెక్స్ అర్జీ దారులతో సమావేశాలు ఏర్పాటు చేసి చెప్పడం జరిగిందని అన్నారు.

## నేషనల్ హైవే 340సి పనుల్లో నాణ్యతపై

# మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆగ్రహం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 31:**
ఉమ్మడి కర్నూలు జిల్లా నందికొట్కూరులో జాతీయ రహదారి 340సి పనులను నేడు స్థానిక ఎమ్మెల్యే గిత్త జయసూర్యతో కలిసి రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలించారు.జాతీయ రహదారి 340 సి పనుల్లో నాణ్యతపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.నేషనల్ హవే 340సి కు ఇరువైపులా నాణ్యత, బలం లేని మట్టిని కాంట్రాక్టర్ వాడటంతో కోతకు గురికావడం జరిగిందనీ మంత్రి తెలిపారు.గతంలో కూడా ఈ కాంట్రాక్టర్ నాణ్యత లేని పనులు చేయడం జరిగిందన్నారు.గతంలో సదరు కాంట్రాక్టర్ నాణ్యత లేని రోడ్ల నిర్మాణ పనులపై వార్తల నేపథ్యంలో విజిలెన్స్ ఎంక్వైరీ చేయమని ఆదేశిస్తే ఇప్పటి వరకు ఆ రిపోర్టు కూడా రాని పరిస్థితి. ఈ విజిలెన్స్ ఎంక్వైరీ కనుమరుగవడం వెనుక ఎవరు ఉండి నడిపిస్తున్నారో బయట పెడతాం నేడు జాతీయ రహదారుల నిర్మాణాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేస్తున్నాయి. ప్రజాసొమ్మును దుర్వినియోగం చేసి, నాణ్యత లేని రోడ్లను నిర్మించే కాంట్రాక్టర్ల





విషయంలో రాజీపడొద్దని సాక్షాత్తూ ముఖ్యమంత్రే చెప్పారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని రోడ్ల వల్ల ప్రజలు ప్రమాదాల పాలయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో.. ఈ ఘటనపై ప్రత్యేకమైన విచారణ జరిపిస్తాం. రోడ్డు అగ్రిమెంట్ మేరకు పనులు చేశారా అనేది కూడా ప్రశ్నార్ధకమే,క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికేట్ లు జారీ చేసిన అధికారులపై కూడా విచారణకు ఆదేశిస్తాం. రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు విషయంలో రాజీపడితే, ఉపేక్షించబోమంటూ అధికారులను హెచ్చరించిన మంత్రి. భవిష్యత్తులో ప్రజాధనం దుర్వినియోగం చేసే విధంగా ఇటువంటి చర్యలకు కాంట్రాక్టర్లు భయపడే విధంగా చర్యలు తీసుకుంటాం.ఈ ఘటన వెనుక ఎంత పెద్ద వారు ఉన్న వదిలిపెట్టేదిలేదన్న మంత్రి. దీనిపై సెంట్రల్ విజిలెన్స్ %డ% ఎన్ ఫోర్స్ మెంట్ కు నివేదిస్తాం. నాణ్యతా ప్రమాణాలు లేని పనులకు సంబంధించి కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేసి, కఠినంగా శిక్షిస్తాం.ఈ హైవే వెంబడి స్థానికంగా ఉన్న రైతులకు, వారి పొలాలకు పోవడానికి సర్వీసు రోడ్డు లేదనే విషయం నా దృష్టికి వచ్చింది.. వారి సమస్యను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తాం.భవిష్యత్తులో రోడ్డు నిర్మాణాల్లో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన మంత్రి

## పదవి వీరమణ పొందిన పోలీసులను

# సన్మానించిన నంద్యాల జిల్లా ఎస్పీ









**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ మే 31:**
నంద్యాల జిల్లాలో 2025 మే 31 తో పదవి విరమణ కాబడిన పోలీసులకు నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శాలువ, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.
సుధీర్ఘకాలం పోలీసుశాఖలో పనిచేసి పోలీసు సిబ్బంది పదవి వీరమణ పొందడం అభినందనీయమని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు.

**పదవి విరమణ పొందిన వారి వివరాలు.**

1) కె. లక్ష్మయ్య సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నంద్యాల.
లక్ష్మయ్య 1987లో మొదటగా పోలీస్ శాఖలో తన ప్రయాణాన్ని ప్రారంభించి నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ టౌన్, నంద్యాల టూ టౌన్, నంద్యాల ట్రాఫిక్, బనగానపల్లి, రేవనూరు,గోస్పాడు మొదలగు పోలీస్ స్టేషన్లలో పనిచేయడం జరిగింది. ఇప్పటివరకు సుమారు 38 సంవత్సరాలు పోలీసు శాఖకు సేవలందించడం జరిగింది.

2) ఓ. శంకర్ రావుసబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డి సి ఆర్ బి నంద్యాల.
శంకర్ రావు 1989లో మొదటగా పోలీస్ శాఖలో తన ప్రయాణాన్ని ప్రారంభించి నంద్యాల తాలూకా, పాములపాడు, చాగలమర్రి,డోన్ టౌన్,ఎన్ రాచర్ల ,అవుకు, కొలిమిగుండ్ల మొదలగు పోలీస్ స్టేషన్ లలో పనిచేయడం జరిగింది. ఇప్పటివరకు సుమారు 36 సంవత్సరాలు పోలీసు శాఖకు సేవలందించడం జరిగింది.

3) ఎం. జగన్మోహన్ రెడ్డి ఆర్మడు రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్.
జగన్మోహన్ రెడ్డి మొదటగా 1983 లో పోలీసు శాఖలో తన ప్రయాణాన్ని ప్రారంభించి సుమారు 42 సంవత్సరాలు పోలీస్ శాఖకు సేవలందించడం జరిగింది.సుదీర్ఘకాలం తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పోలీసు శాఖకు సేవలందించడం ఎంతో గర్వంగా ఉందని,మీరందరూ కుటుంబాలతో సంతోషంగా గడపాలని, పదవివీరమణ పొందిన తర్వాత ఏమైనా సమస్యలుంటే నన్ను సంప్రదించవచ్చుని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు జిల్లా సాయుధ బలగాల అడిషనల్ ఎస్పీ చంద్రబాబు పాల్గొన్నారు.

# ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడుతున్న 7 మంది అరెస్టు

### -కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్

### -91 లక్షల నగదు స్వాధీనం, 7 మొబైల్ ఫోన్ లు సీజ్ చేసిన ... ఆదోని ఒకటవ పట్టణ పోలీసులు.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు క్రైమ్ మే 31:**
గత నెలలో జరిగిన జిల్లా ఎస్పీ నేర సమీక్ష సమావేశంలో బాగంగా చాలామంది యువకులు క్రికెట్ బెట్టింగ్ ను ఆన్ లైన్ లో ఆడుతూ, బెట్టింగ్ కు వ్యసనపరులుగా మారి డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా అప్పులు చేసి మరీ, ఆ అప్పులు తీర్చలేకఇంట్లో తల్లితండ్రులకు చెప్పుకోలేక , తమ భవిష్యత్తు పై వారి తల్లి తండ్రులు పెట్టుకున్న ఆశలను అడియశలు చేస్తూ ఆత్మహత్యలకు పాల్పడుతూ ఉండడం వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుచున్నాయని బెట్టింగ్ ను ఎలాగైనా అరికట్టాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాలు జారీ చేశారు.ఈ మేరకు, ఆదోని డిఎస్పి %వీ%. హేమలత సూచనల మేరకు ఆదోని %×%టౌన్ %జ× ఖ%. శ్రీ రామ్ మరియు స్టేషన్ సిబ్బంది రాబడిన సమాచారము మేరకు 18.05.2025 వ తేదీన సాయంత్రం 03.30 గంటలకు వాల్మీకి నగర్ లోని వాల్మీకి గుడి కి ఎదురుగా మొబైల్ ఫోన్ లలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాపై దాడి చేసి ఎస్. ఆర్.నాగరాజును అదుపులోనికి తీసుకోగా మిగిలిన ముద్దాయిలు పారిపోయారు అతని నుండీ నగదు 50,000 వేల రూపాయలను స్వాదీన పరచుకుని ఆదోని 1 టౌన్ పోలీసు స్టేషన్ నందు కేసు నమోదు చేయడమైనది. టెక్నాలజీ ఆధారంగా దొరికిన సమాచారం మేరకు CI K. శ్రీ రామ్ మరియు సిబ్బంది కలిసి కర్నూలు, హైదరాబాదు ఒంగోలు,చిలకలూరు పేట, బెంగళూరు సిటిలలో తిరిగి చివరకు 30.05.2025వ తేదీన మద్యాహ్నం 11.30 గంటలకు ఆదోని టౌన్ లోని ఎల్లమ్మ కొండ లోని మర్రి చెట్టు దగ్గర 7 మంది క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులను అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి 7 మొబైల్ ఫోన్ లు మరియు నగదు 91,00,000 లక్షల రూపాయలను




స్వాదీనపరచుకోవడమైనది.
ముద్దాయుల నుంచి స్వాదీనపరచుకున్నరు
మసీదుపుర ఇస్మాయిల్ ఏ ఇస్మాయిల్, వయసు 44 సం .లు, తండ్రి%వీ%. నజీర్ అహమ్మద్, మసీదుపుర, ఆదోని టౌన్ బోయ మహానంది వయసు 55 సం.లు, తండ్రి పేరు రామన్న, బోయగేరి, ఆదోని టౌన్
బోయ రమేశ్, వయసు 26 సం .లు, తండ్రి పేరు బోయ మహానంది, మరాటి వీధి, ఆదోని టౌన్.
రాజేష్, వయసు 38 సం .లు, తండ్రి పేరు ఎస్. సంజీవ రెడ్డి, గౌరీబిధనూర్, చిక్కబళ్లాపూర్, కర్ణాటక, ప్రస్తుత నివాసము పురువంకర, %C block -% 302, యలహంక, మదర్ డైరీ, బెంగళూరు సిటి.
చుండి శ్రీనివాస రావు ఏ నాయుడు, వయసు 48 సం .లు, తండ్రి పేరు %ూఫ్వ% శ్రీరాములు, ఎద్దులూరిపాడు గ్రామము, జరుగుమల్లి మండలం, ఒంగోల్ జిల్లా, ప్రస్తుతం నివాసం మంగమూరు రోడ్, ఒంగోల్ టౌన్. అడ్డాల కల్యాణ్, వయసు 33 సం, తండ్రి పుల్లయ్య, సత్యనారాయణపురం, ఒంగోల్ టౌన్, రఘు ఆచారిఅయిజ ప్రస్తుతం హైదరాబాద్వీరు ఆడుతున్న క్రికెట్ బెట్టింగ్ యాప్స్ 1. నేషనల్ ఎక్స్చేంజ్ 92. రాధే ఎక్స్చేంజ్ ,
3. వజ్రా ఎక్స్చేంజ్, 4. నేషనల్ 777,
5. మోర్ ఎక్స్చేంజ్ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి సాంకేతికత సహాయంతో క్రికెట్ బుకీలను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరచిన ఆదోని డిఎస్పీ హేమలత ని , ఆదోని ఒన్ టౌన్ సిఐ శ్రీరామ్ , ఎఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ మునిస్వామి, రంగస్వామి, ఏకవీర, ఫక్కీరప్ప, హుస్సేన్ భాషాలను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారు ప్రత్యేకంగా అభినందించారు.

### నటుడు శ్రీకాంత్‌కు ప్రైవేటుగా పూజలు చేసిన ఫలితం

# శ్రీకాళహస్తి ఆలయ వేద పండితుడి సస్పెన్షన్



**తిరుపతి,ఆంధ్ర ప్రగతి మే 31::** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి ఆలయ వేద పండితుడిపై సస్పెన్షన్ వేటు పడింది. సినీ నటుడు శ్రీకాంత్ కుటుంబానికి ప్రైవేటుగా నవగ్రహ శాంతి పూజలు నిర్వహించిన వ్యవహారంపై శ్రీకాళహస్తి ఆలయ అర్చకుడిపై ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. శ్రీకాళహస్తి పట్టణం సన్నిధి వీధిలోని రాఘవేంద్ర స్వామి మఠంలో ఈనెల 29న గురువారం హీరో శ్రీకాంత్ కుటుంబం నవగ్రహ శాంతి పూజలు చేయించుకున్నారు. ముక్కంటి ఆలయంలో పనిచేసే కొందరు అర్చకులు, వేద పండితులు శ్రీకాంత్‌కు ప్రైవేటుగా పూజలు నిర్వహించారు. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అయితే శ్రీకాళహస్తి ఆలయంలో పనిచేసే ఓ అర్చకుడు పూజలు నిర్వహించడంతో అనేక విమర్శలు వెల్లువెత్తాయి. శ్రీకాళహస్తి ఆలయ అర్చకులు బయట ఎక్కడా కూడా ఇలాంటి పూజలు చేయకూడదు అనే నిబంధనలు ఉన్నాయి. ఏ ఆలయంలో అయినా కూడా ఆ ఆలయానికే పనిచేయాలని.. అలా కాకుండా ప్రైవేటుగా ఇలాంటి పూజలు చేసినప్పుడు సదరు అర్చకులపై దేవాదాయ శాఖ చట్టం ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో శ్రీకాంత్ ఫ్యామిలీకి శ్రీకాళహస్తి అర్చకుడు ప్రత్యేకంగా పూజలు చేసిన అంశంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తడం దేవస్థానం ఈవో బాపిరెడ్డి వెంటనే స్పందించారు.ప్రత్యేక పూజలు చేసిన అర్చకుడికి మెమో ఇచ్చారు. శ్రీకాళహస్తి దేవస్థానం ప్రతిష్ట దెబ్బతినే విధంగా ప్రవర్తించినందుకు ఆలయంలో విధులు నిర్వహించిన వేద పండితులను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఈవో ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలు అతిక్రమించినందుకు అర్చకుడిని ఈవో బాపిరెడ్డి విధుల నుంచి తొలగించారు. అలాగే గతంలో కూడా చాలా మంది ఇలా ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న సంఘటనలు ఉన్నాయి. ఈ క్రమంలో ఇలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం వల్ల అలాంటి వ్యవహారంలో మిగిలిన వారు భయంతో ఉండే అవకాశం ఉంటుందని ఈవో బాపిరెడ్డి ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు- తెలుస్తోంది.

# ఏలూరు కలెక్టరేట్‌లో నలుగిరికి కరోనా

### హోం ఐసోలేషన్‌కు ఉద్యోగులు



**ఏలూరు,ఆంధ్ర ప్రగతిమే 31:**దేశవ్యాప్తంగా మరోసారి కరోనా పంజా విప్పుతోంది.. తెలుగు రాష్ట్రాల్లోన్రూ వరుసగా కేసుల సంఖ్య పెరుగుతూ వచ్చింది.. ఏపీలో పలు జిల్లాల్లో కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి.. తాజాగా, ఏలూరు కలెక్టరేట్‌లో కరోనా మహమ్మారి కలకలం సృష్టించింది.. కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక సిబ్బందిలో నలుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో కలెక్టరేట్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది అందరికీ వైద్య బృందం కరోనా టెస్టులు నిర్వహిస్తున్నారు.. పాజిటివ్ వచ్చిన ఉద్యోగులు ప్రస్తుతం హోమ్ ఐసోలేషన్ లో ఉన్నారు. నాలుగురోజుల క్రితం శాంతినగర్ లో ఉండే ఇద్దరు వృద్ధులకు పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. వారిద్దరు గుంటూరు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటు-న్నారు.. ఇప్పుడు మరో నాలుగు కేసులు వెలుగు చూసినట్టు- అయ్యింది.. కాగా, రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కోవిడ్ కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి.. అయితే, కరోనా మహమ్మారి బారిన పడకుండా.. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు వైద్య నిపుణులు..

------------------

# పూర్తిస్థాయి డీజీపీగా

## హరీష్ కుమార్ గుప్తా బాధ్యతలు స్వీకరణ.



**అమరావతి ఆంధ్ర ప్రగతి మే 31:** డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన హరీష్ కుమార్ గుప్తా శనివారం మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ దళాధిపతిగా పదవీ భాధ్యతలు స్వీకరించారు. 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన హరీష్ కుమార్ గుప్తా విజిలెన్స్ %డ% ఎన్ ఫోర్స్ మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్ పోస్టులో కొనసాగుతూ ఇన్ ఛార్జి డీజీపీ గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నేడు పదవీ భాధ్యతలు స్వీకరించిన హరీష్ కుమార్ గుప్తా పదవీ విరమణ తేదీతో సంబంధం లేకుండా డీజీపీగా నేటి నుంచి రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. గత నాలుగు నెలలుగా ఇన్ ఛార్జి డీజీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన పోలీసుశాఖలో తనదైన ముద్ర వేశారు. ఈ ఏడాది జనవరిలో ద్వారకా తిరుమలరావు డీజీపిగా పదవీ విరమణ చేసిన తర్వాత మళ్లీ హరీష్ కుమార్ గుప్తాకే ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఇన్ ఛార్జిగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఇవాళ్టి నుంచి హరీష్ కుమార్ గుప్తా పూర్తిస్థాయి డీజీగా వ్యవహరించనున్నారు. డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన హరీష్ కుమార్ గుప్తాను పలువురు సీనియర్ పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# దేశవ్యాప్తంగా మొత్తం 2,700 కోవిడ్ కేసులు

### ఏడు మరణాలు నమోదు

**న్యూఢిల్లీ,ఆంధ్ర ప్రగతి మే 31::** దేశవ్యాప్తంగా మళ్లీ మహమ్మారి కరోనా వైరస్ విజృంభిస్తోంది. గత వారం రోజుల్లోనే కోవిడ్ పాజిటివ్ కేసులు ఐదు రెట్లు పెరిగాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా మొత్తం 2,700 కోవిడ్ కేసులు, ఏడు మరణాలు నమోదు అయ్యాయని తెలిపింది. ప్రధానంగా మూడు రాష్ట్రాల్లోన్రే ఎక్కువ కేసులు బయటపడుతున్నాయి. కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీలో కరోనా తీవ్రత అధికంగా ఉందని చెప్పింది. కేరళలో 1,147 పాజిటీ-వ్ కేసులు నమోదు కాగా.. మహారాష్ట్రలో 424, ఢిల్లీలో 294 కేసులు బయటపడ్డాయని ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని కేంద్రం ఆదేశించింది. మళ్లీ కరోనా విపత్తు వస్తే..ఎదుర్కొనేందుకు కేంద్రం పూర్తి సిద్ధంగా ఉందని కేంద్ర ఆరోగ్య, ఆయుష్ సహాయ మంత్రి ప్రతాప్రరావు జాదవ్ చెప్పారు.

# తొమ్మిదవ ఆంధ్ర గర్ల్స్ ఎన్సిసి బెటాలియన్

# శిక్షణా శిబిరం ఘనంగా ప్రారంభం.

## -ప్రారంభించిన కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 31:**

నంద్యాల పట్టణంలోని శ్రీ రామకృష్ణ అటానమస్ డిగ్రీ మరియు పీజీ (స్టేట్ బ్యాంక్ కాలనీ లో ) కళాశాలలో 9వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కర్నూలు వారి ఆధ్వర్యంలో పది రోజులు అనగా 29బ5బ25 నుండి 07బ06బ25 వరకు బాలికల ఎన్సిసి శిక్షణా శిబిరాన్ని కర్నూలు గ్రూపు కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి లాంఛనంగా ప్రారంభించారు.

క్యాంప్ కమాండెంట్ గా కర్నూలు బాలికల ఎన్సిసి బెటాలియన్ కమాండర్ జోబి ఫిలిప్ వ్యవహరిస్తున్నారు.

క్యాంపు సందర్శన సందర్భంగా కాల్నెల్ అలోక్ త్రిపాటి మాట్లాడుతూ నంద్యాల శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో 10 రోజులు క్యాంపు నిర్వహణకు అన్ని సదుపాయాలు ఉండటం వలన క్యాంపు నిర్వహణకు రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి సానుకూల దృక్పదముతో ఇక్కడ క్యాంపును నిర్వహిస్తూ ఉన్నాము. పది రోజులు శిక్షణ శిబిరంలో ఎన్సిసి క్యాడేట్స్ అనేక విషయాలు నేర్చుకుంటారని

డ్రిల్లు, వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, హెల్త్ అండ్ హైజిన్, యోగ గెస్ట్ లెక్చర్స్, ఫైరింగ్ స్పోర్ట్స్ యూనిటీ పర్సనాలిటీ డెవలప్మెంట్ టి ఎస్ సి (తల్ సైనిక్ క్యాంప్)మరియు ఆర్డీసీ(రిపబ్లిక్ డే పెరేడ్) సెలక్షన్స్ తదితర అంశాలు ఉంటాయి. ఈ అంశాలలో క్యాడేట్స్ కు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఎన్సిసి క్యాటట్స్ మీ పర్సనాలిటీని డెవలప్ చేసుకున్నప్పుడు దేశానికి కూడా ఉపయోగపడతారు. క్రమశిక్షణ కలిగి ఉండాలి 2047 వాటికి వికసిత భారత్ నిర్మాణం జరగాలి అంటే మీరందరూ ఎంతో కష్టపడాలి. మీరు మంచి అలవాట్లతో మంచి వ్యక్తిత్వంతో ఎదిగినప్పుడు దేశం కూడా అభివృద్ధి చెందుతుంది. వికసితభారత్ లక్ష్యాలను కూడా భారత్ సాధిస్తుంది. ఈ శిక్షణ శిబిరంలో దాదాపు 600 మంది ఎన్సిసి క్యాడేట్స్ పాల్గొన్నారు. క్యాంపు కమాండెంట్ గా కాల్నెల్ జోబి ఫిలిప్, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ గా లెఫ్టినెంట్ కల్నల్ శ్రీ ప్రియ మేడం వ్యవహరిస్తున్నారు.

ముఖ్యంగా ఇంత గొప్ప అవకాశం ఎన్నో సదుపాయాలు ఎన్సిసికి కలిగిస్తున్న రామకృష్ణ విద్యా సంస్థల అధినేత ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి గారికి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు. ప్రతి సంవత్సరము కర్నూలు అనంతపురం నంద్యాల జిల్లాల ఎన్సిసి క్యాడెడ్స్ కు అనంతపురంలో క్యాంపులు నిర్వహించే వారమని కానీ కొన్ని బిల్డింగులు శిధిలావస్థకు చేరుకోవడం వలన ఎన్సీసీ కాడేట్స్ శ్రేయస్సు కోసం నంద్యాల జిల్లాలో రామకృష్ణ విద్యా సంస్థలలో క్యాంపు నిర్వహిస్తున్నామని అన్నారు.

ఈ సందర్భంగా క్యాంప్ కమాండెంట్ కాల్నెల్ జోబి ఫిలిప్ మాట్లాడుతూ ఈ 10 రోజుల శిక్షణా శిబిరంలో ఎన్సిసి క్యాడేట్స్ ఎన్నో విషయాలను నేర్చుకుంటారని ఆర్మీ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వ ఎన్సిసి విభాగం ఆధ్వర్యంలో క్యాంప్ నిర్వహిస్తూ ఉన్నాము. క్యాంపులో ఆర్మీ సబ్జెక్టులతోపాటు నార్మల్ సబ్జెక్టులు కూడా నేర్చుకుంటారని. ఎన్సిసి లో చేరిన ప్రతి క్యాడేట్ తప్పనిసరిగా క్యాంపు చేయాలని అలా చేస్తేనే ఎన్సిసి బి మరియు సి సర్టిఫికెట్ పరీక్ష కు అర్హత సాధిస్తారని లేనియెడల వాళ్లు పరీక్షలు రాయలేరని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్క ఎన్సిసి క్యాడేట్టుకు ఈ క్యాంపులు చేయటం అవసరం. క్యాంపులో ఎన్సిసి క్యాడేట్స్ అనేక విషయాలు నేర్చుకోవాలని క్యాంపు ఉద్దేశాలు తెలుసుకోవాలని ప్రతి విషయము నేర్చుకోవడానికి ప్రయత్నం చేయాలని కొత్త విషయాలు నేర్చుకోవాలని అన్నారు. ఇలా క్యాంపులు చేయడం వల్ల మీరు మన సమాజం యొక్క కల్చర్, ట్రెడిషన్, ఈటింగ్ హ్యాబిట్స్ ఫ్రెండ్స్ తో కలిసి ఉండడం ఇలాంటివి ఎన్నో నేర్చుకుంటారని ముఖ్యంగా టీం వర్క్ డెవలప్ అవుతుందని అన్నారు. రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి ఎన్సిసి శిక్షణ శిబిరంలోని ఎన్సిసి క్యాడేట్స్ ఉద్దేశించి మాట్లాడుతూ అందరూ క్రమశిక్షణతో ఉండాలని దాదాపుగా 600 మంది క్యారెట్స్ ఎన్సిసి శిబిరానికి వచ్చారని క్యాంపు నిర్వహణకు ఎన్సిసి అధికారులు మమ్మల్ని సంప్రదించినప్పుడు మేము సరే అని ఒప్పుకొని వారికి కావలసిన ఏర్పాట్లన్నీ సదుపాయాలని కల్పించాము. ఫైరింగ్ రేంజ్ ఎన్సిసి బాయ్స్ హాస్టల్లో కొత్తగా నిర్మించి ఇవ్వటం జరిగింది దీనివలన ఎన్సిసి క్యాడేట్స్ ఫైరింగ్ లో కూడా వారి సత్తాను నిరూపించుకోవచ్చు ఇక్కడ క్యాంపు నిర్వహించడం వలన తమ కళాశాలలోని ఎన్సిసి క్యాడేట్స్ కి ఉపయోగపడుతుందని అంతేకాకుండా స్టూడెంట్స్ అందరికీ ఆత్మవిశ్వాసము దేశం పట్ల గౌరవం ఐక్యమత్యము అలవాడతాయని, ధైర్యంగా ఉండడం ఎటువంటి పరిస్థితులనైనా తట్టుకొనే మనోస్థైర్యం ఏర్పడుతుందని అన్నారు. మీకు కల్పించిన సదుపాయాలన్నీ సక్రమంగా ఉపయోగించుకోవాలి అలా ఉపయోగించుకున్నప్పుడు తర్వాత క్యాంపు కు వచ్చే వారి వారికి కూడా ఇవన్నీ ఉపయోగపడతాయి అని అన్నారు. కళాశాల డైరెక్టర్ శ్రీ హేమంత్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్సిసి శిబిరానికి దాదాపుగా 600 మంది రావడం సంతోషంగా ఉందని ఎన్సిసి క్యాడేట్స్ అందరూ ఉత్సాహంగా అన్ని అంశాలలో పోటీలలో పాల్గొని మంచి వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకోవాలని తమ కళాశాలలో ఉన్న స్పోర్ట్స్ గ్రౌండ్, ఎన్సిసి ఫైరింగ్ ఇవన్నీ చక్కగా ఉపయోగించుకొని వృద్ధిలోకి రావాలని కోరారు.

కర్నూలు గ్రూప్ హెడ్ క్వార్టర్స్ వారు (టోకెన్ ఆఫ్ అప్రిసియేషన్) గౌరవ అభినందన అవార్డును కర్నూలు గ్రూప్ కమాండర్ కాల్నెల్ అలోక్ త్రిపాఠి చేతుల మీదుగా రామకృష్ణారెడ్డికి ప్రధానం చేశారు.

ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి ఎన్సిసి యూనిట్ స్కూల్ ధన్యవాదములు తెలిపారు.

వివిధ కాలేజీలకు చెందిన ఎన్సిసి క్యాటరేట్స్ సీనియర్ ర్యాంకులు క్రీడలలో ప్రతిభ చూపించిన ఎన్సిసి క్యాండిడేట్స్ కు మెడల్స్ మెమెంటోలు ప్రధానం చేశారు.

కార్యక్రమంలో కాల్నెల్ అలోక్ త్రిపాఠి, కాల్నెల్ జోబి ఫిలిప్, లెఫ్టినెంట్ కాల్నెల్ శ్రీ ప్రియ మేడంలను కళాశాల యాజమాన్యం మేమెంటో శాలువాలతో ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో ఎన్సిసి ఆఫీసర్లు డాక్టర్ లలితా సరస్వతి కమల్ ఖాన్,లక్ష్మీ దుర్గ గీతాంజలి, రూట్ శ్రీదేవి ధర్మేంద్ర కుమార్ ఎస్ ఎస్ రెడ్డి, సుబేదార్ భాష, ధర్మేందర్ సింగ్,భువనచంద్ర,భూపాల్ సింగ్,మునిందర్ సింగ్, షరీఫ్,నజీర్ అహ్మద్ ఎన్సిసి పిఐ స్టాఫ్ కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్సిసి పాటతో కార్యక్రమము జయప్రదంగా ముగిసింది.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 1 జూన్ 2025

# బుమ్రా జట్టుకు అత్యంత విలువైన బౌలర్



ప్రతీసారి పక్కా ఏదో ఒక అద్భుతం చేస్తాడు ముంబయి కెప్టెన్ పాండ్య కీలక వ్యాఖ్యలు

2025 ఐపీఎల్?లో ముంబయి ఇండియన్స్ క్వాలిఫయర్– 2కు దూసుకెళ్లింది. శుక్రవారం గుజరాత్? టైటాన్స్?తో హోరాహోరీగా సాగిన ఈ హై స్కోరింగ్ మ్యాచ్?లో ముంబయిదే పైచేయి అయ్యింది. ఈ మ్యాచ్?లో ముంబయి 20 పరుగుల తేడాతో నెగ్గి, క్వాలిఫయర్ 2కు అర్హత సాధించింది. అయితే స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఈ విజయంలో కీలక పాత్ర పోషించాడు. చేజారిపోతున్న మ్యాచ్?ను ముంబయివైపు తిప్పాడు. దీనిపై మ్యాచ్ అనంతరం కెప్టెన్ పాండ్య మాట్లాడాడు. బుమ్రా తమ జట్టుకు అత్యంత విలువైన బౌలర్? అని ప్రశంసించాడు. 228 పరుగులు చేసినప్పటికీ, మ్యాచ్?లో బుమ్రాను ఎలా ఉపయోగించుకోవాలి? ఎప్పుడెప్పుడు బౌలింగ్ చేయించాలని ఎలా ప్లాన్ చేశావంటూ పాండ్యను మ్యాచ్ తర్వాత హర్ష భోగ్లే అడిగాడు. 'బుమ్రాతో ఏయే ఓవర్ బౌలింగ్ చేయించాలని ఎలా డిసైడ్ అయ్యావ్?'అని హార్దిక్?ను భోగ్లే అడిగాడు. దానికి పాండ్య చిన్న చిరునవ్వుతో సింపుల్?గా సమాధానం ఇచ్చాడు. అది చాలా సింపుల్! ఎప్పుడైతే మ్యాచ్ మా చేతుల్లోంచి చేజారిపోతుందని అనిపిస్తుందో, వెంటనే బుమ్రాను దింపుతా. అతడు మాకు అత్యంత విలువైన ఆటగాడు. ఆటలో పరిస్థితులు కఠినంగా మారుతున్నాయంటే చాలు, అతడికి బంతినిచ్చేస్తా. అలా ఇచ్చిన ప్రతీసారి బుమ్రా పక్కా ఏదో ఒక అద్భుతం చేస్తాడు' అని బుమ్రాను మెచ్చుకున్నాడు. అలాగే బుమ్రాను ముంబయిలో ఇళ్ల (ఖరీదైన ఆటగాడు అనే అర్థంలో) ధరలతో పోల్చాడు. అయితే భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ విజయం వైపునకు సాగిపోతున్న దశలో జస్ప్రీత్ బుమ్రా ముంబయికి బ్రేక్ ఇచ్చాడు. 13 ఓవర్లు పూర్తైయ్యే సరికి గుజరాత్ 148–2 తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. అప్పటికి గుజరాత్ విజయానికి 42 బంతుల్లో 81 పరుగులు కావాలి. సాయి సుదర్శన్ (77), వాషింగ్టన్ సుందర్ (47) క్రీజులో ఉండడంతో ఈజీగా గెలుస్తుందనిపించింది.కానీ, ఆ తర్వాత 14వ ఓవర్ వేయడానికి బుమ్రాకు పాండ్య బంతినిచ్చాడు. ఆ ఓవర్?లోనే మ్యాచ్ మలుపు తిరిగింది.? నాలుగో బంతికి సూపర్ యార్కర్?తో వాషింగ్టన్ సుందర్?ను క్లీన్ బౌల్డ్ చేసి, ముంబయి శిబిరంలో జోష్ నింపాడు. అంతేకాకుండా ఆ ఓవర్?లో కేవలం నాలుగు పరుగులే ఇచ్చి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాడు. ఇక కీలకమైన 18వ ఓవర్?లో 9 పరుగులు మాత్రమే ఇచ్చి గుజరాత్?ను మరిన్ని కష్టాల్లోకి నెట్టాడు. ఓవరాల్?గా బుమ్రా ఈ మ్యాచ్?లో 4 ఓవర్లకు 6.8 ఎకనమీతో 27 పరుగులిచ్చి 1 వికెట్ పడగొట్టాడు.

# రోహిత్ శర్మ దెబ్బకు రషీద్ ఖాతాలో చెత్త రికార్డ్



2025 ఐపీఎల్ ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్‌పై ముంబయి ఇండియన్స్ సూపర్ విక్టరీ కొట్టింది. ఈ విజయంతో ముంబయి క్వాలిఫయర్– 2కు దూసుకెళ్లింది. స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ (81 పరుగులు:) ఈ మ్యాచ్‌లో సూపర్ ఇన్నింగ్స్‌తో రఫ్ఫాడించాడు. గుజరాత్ బౌలర్లను ఒక్కొక్కరిగా లక్ష్యంగా చేసుకొని బౌండరీలు బాదాడు. ఈ నేపథ్యంలో స్పిన్నర్ రషీద్ ఖాన్ ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత చెత్త రికార్డ్ మూట గట్టుకున్నాడు. అదేంటంటేఈ మ్యాచ్‌లో రషీద్ ఖాన్ తన నాలుగు ఓవర్ల స్పెల్‌లో వికెట్ లేకుండా 7.80 ఎకనమీతో 31 పరుగులు ఇచ్చుకున్నాడు. ఇందులో 9, 15వ ఓవర్లలో రషీద్ బౌలింగ్‌లో రోహిత్ శర్మ రెండు చక్కటి సిక్స్‌లు బాదాడు. 9వ ఓవర్లో స్వీప్ షాట్‌తో బంతిని స్టాండ్స్‌లోకి పంపిన రోహిత్, 15వ ఓవర్లో డీప్ మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ బాదాడు. దీంతో ఈ మ్యాచ్‌లో రషీద్ రెండు సిక్స్‌లు సమర్పించుకున్నాడు.ఈ క్రమంలోనే ఐపీఎల్‌లో సింగిల్ సీజన్‌లో అత్యధిత సిక్స్‌లు ఇచ్చిన బౌలర్‌గా రషీద్ చెత్త రికార్డ్ మూటగట్టుకున్నాడు. ఇదివరకు ఈ రికార్డ్ పేసర్ మహ్మద్ సిరాజ్‌పై ఉండేది. 2022 ఎడిషన్‌లో సిరాజ్ 31 సిక్స్‌లు ఇచ్చాడు. తాజా సీజన్‌లో రషీద్ 33 సిక్స్‌లతో సిరాజ్‌ను అధిగమించాడు. దీంతో ఐపీఎల్‌లో ఒక సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు సమర్పించిన బౌలర్‌గా రషీద్ నిలిచాడు.

# ప్రీక్వార్టర్స్‌కు సినర్, గాఫ్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో సీడెడ్ల పయనం సాఫీగా సాగుతోంది. పురుషుల టాప్‌సీడ్ సినర్, రెండోసీడ్ అల్కారజ్, మూడోసీడ్ జ్వెరెవ్, ఐదోసీడ్ డ్రేపర్, మహిళల రెండోసీడ్ కొకొ గాఫ్, మూడోసీడ్ పెగులా, ఆరోసీడ్ మిర్రా ఆండ్రీవా ప్రీక్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించారు. శనివారం జరిగిన సింగిల్స్ మూడో రౌండ్‌లో సినర్ 6–0, 6–1, 6–2తో లెహకాపై, జ్వెరెవ్ 6–2, 7–6 (4), 6–1తో కొబోలీపై, డ్రేపర్ 6–2, 6–4, 6–2తో ఫొనెస్కాపై, అల్కారజ్ 6–1, 6–3, 4–6, 6–4తో జుముర్‌పై నెగ్గారు. మహిళల సింగిల్స్‌లో గాఫ్ 6–1, 7–6(3)తో బౌస్కోవాను, పెగులా 3–6 6–4, 6–2తో వోండ్రొసోవాని, ఆండ్రీవా 6–3, 6–1తో పుటింట్సేవాని ఓడించారు. 10వ సీడ్ బడొసాకు 6–1, 7–5తో 17వ సీడ్ కసట్కినా షాకిచ్చింది.

**బాలాజీ జోడీ అవుట్:** పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో శ్రీరామ్ బాలాజీ/మిగ్వెల్ రేయస్ (కెనడా) ద్వయం 3–6, 4–6తో ఇటలీ జంట సిమోన్/ఆండ్రియా చేతిలో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది.



# క్వాలిఫయర్-2 రద్దయితే ఏ జట్టు ఫైనల్‌కు చేరుతుంది?




ఐపీఎల్ 2025 క్వాలిఫయర్–2 మ్యాచ్ జూన్ 1న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య జరగనుంది. శుక్రవారం రాత్రి ముంబై ఇండియన్స్ ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టును 20 పరుగుల తేడాతో ఓడించింది. ఈ మ్యాచ్ ముల్లన్‌పూర్‌లో జరిగింది. ఇప్పుడు క్వాలిఫయర్–2లో గెలిచిన జట్టు ఫైనల్‌లో ఆర్సీబీని ఎదుర్కొంటుంది. అదే సమయంలో పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య జరిగే క్వాలిఫయర్–2 రద్దు చేయబడితే ఏ జట్టు ఫైనల్‌లో స్థానాన్ని దక్కించుకుంటుందనేది పెద్ద ప్రశ్న.ఐపీఎల్ 2025లో వర్షం కారణంగా చాలా మ్యాచ్‌లు రద్దు చేయబడ్డాయి. అటువంటి పరిస్థితిలో వర్షం లేదా ఏదైనా కారణం వల్ల క్వాలిఫయర్–2 రద్దు చేయబడితే ఏ జట్టుకు లాభం చేకూరుతుందనే ప్రశ్న ఇప్పుడు అభిమానుల మనస్సుల్లో తలెత్తుతోంది. క్వాలిఫయర్–2 మ్యాచ్ కోసం రిజర్వ్ డే ఉంది. అయితే రిజర్వ్ డే రోజున కూడా మ్యాచ్ రద్దు చేయబడితే.. పాయింట్ల పట్టికలో మంచి ర్యాంకింగ్‌లో ఉన్న జట్టు ఫైనల్‌లో చోటు దక్కించుకుంటుంది.అంటే మ్యాచ్ రద్దు చేయబడితే పంజాబ్ కింగ్స్ దాని నుంచి నేరుగా ప్రయోజనం పొందుతుంది. ఎందుకంటే లీగ్ మ్యాచ్‌లు ముగిసిన తర్వాత పంజాబ్ కింగ్స్ అత్యధికంగా 19 పాయింట్లతో టాప్–1లో నిలిచింది. అలా జరిగితే ఆ తర్వాత జూన్ 3న జరిగే ఐపీఎల్ 2025 ఫైనల్‌లో ఆర్సీబీతో తలపడుతుంది. అయితే క్వాలిఫయర్–1లో పంజాబ్ కింగ్స్ జట్టును ఓడించి ఆర్సీబీ ఫైనల్‌కు చేరుకుంది.అయితే క్వాలిఫయర్–2 మ్యాచ్ రద్దయ్యే అవకాశం లేదు. నివేదికల ప్రకారం క్వాలిఫయర్–2 మ్యాచ్‌కు వర్షం ముప్పేమీ లేదు. మ్యాచ్ మధ్యలో వర్షం కురిసినా మ్యాచ్ ఆపివేయబడి.. మళ్లీ అక్కడి నుంచే ప్రారంభించబడుతుంది.గుజరాత్ టైటాన్స్ జట్టుతో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 228 పరుగులు చేసింది. రోహిత్ శర్మ 81 పరుగులు, జానీ బెయిర్‌స్టో 22 బంతుల్లో 47 పరుగులు, సూర్యకుమార్ యాదవ్ 20 బంతుల్లో 33 పరుగులు, తిలక్ వర్మ 11 బంతుల్లో 25 పరుగులు, హార్దిక్ పాండ్యా 9 బంతుల్లో 22 పరుగులు చేశారు. తర్వాత లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 208 పరుగులు మాత్రమే చేసి 20 పరుగుల తేడాతో ఓడిపోయింది.

# నిత్య బృందానికి రజతం

**ఆఖరి రోజు ఆరుఆసియా అథ్లెటిక్స్**

**24 పతకాలతో భారత్‌కు రెండోస్థానం**



గుమి: ప్రతిష్ఠాత్మక ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిపలో తెలుగమ్మాయి నిత్య గంధె రజత పతకంతో మురిసింది. అయితే మరో తెలుగు అథ్లెట్ జ్యోతి యర్రాజి 200 మీటర్ల పరుగులో నిరాశ పరిచింది. ఇక..శనివారం చివరి రోజు భారత్ 3 రజతాలు, 3 కాంస్యాలతో మొత్తం ఆరు పతకాలు సొంతం చేసుకుంది. మహిళల 4.100 మీటర్ల రిలేలో హైదరాబాద్‌కు చెందిన నిత్య గంధె, అభినయ, స్నేహ, సర్బాని నందతో కూడిన భారత జట్టు 43.86 సెకన్ల టైమింగ్‌తో రేస్‌ను పూర్తి చేసి రజత పతకం కైవసం చేసుకుంది. మహిళల 200 మీటర్ల పరుగు ఫైనల్లో జ్యోతి యర్రాజి 23.47 సెకన్ల టైమింగ్‌తో ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. చాంపియన్‌షిపలో ఇంతకుముందు మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి స్వర్ణ పతకం గెలిచిన సంగతి తెలిసిందే. అయితే 200 మీటర్ల లోనూ పోటీపడిన నిత్య 23.90 సెకన్లతో రేస్‌ను ముగించి ఏడో స్థానంలో నిలిచింది. మహిళల ఐదు వేల మీటర్ల పరుగులో పారుల్ చౌధురి 15 నిమిషాల 15.53 సెకన్ల టైమింగ్‌తో రజత పతకం చేజిక్కించుకుంది. ఇప్పటికే 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లోనూ పారుల్ రజతం నెగ్గింది. పురుషుల 200 మీటర్ల పరుగులో అనిమేష్, మహిళల 800 మీటర్ల రేసులో పూజ, మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో విద్య రామ్‌రాజ్ కాంస్య పతకాలను భారత్ ఖాతాలో చేర్చా రు. జావెలిన్ త్రోలో సచిన్ యాదవ్ 85.16 మీటర్ల దూరంతో రజత పతకం సాధించాడు. పాకిస్థాన్‌కు చెందిన పారిస్ ఒలింపిక్స్ చాంపియన్ అర్షద్ నదీమ్ (86.40 మీ.) స్వర్ణం నెగ్గాడు. ఇక..ఈ చాంపియన్‌షిపను భారత్ మొత్తం 24 పతకాలతో (8 స్వర్ణాలు, 10 రజతాలు, 6 కాంస్యాలు) ఓవరాల్‌గా రెండో స్థానంతో ముగించింది. 19 పసిడి, 9 రజత, 4 కాంస్యా లతో కలిపి మొత్తం 32 పతకాలతో చైనా అగ్రస్థానంలో నిలిచింది. 5 స్వర్ణ, 11 రజత, 12 కాంస్యాలతో ఓవరాల్‌గా 28 పతకాలు సాధించిన జపాన్‌కు రెండోస్థానం దక్కింది.

# కరుణ్ నాయర్ డబుల్ సెంచరీ..

## భారీ స్కోర్ దిశగా ఇండియా-ఏ జట్టు

**ఇండియా-ఏ, ఇంగ్లండ్ లయన్స్ మధ్య 4 రోజుల అనధికార టెస్టు మ్యాచ్**

**ఫస్ట్ బ్యాటింగ్ చేస్తున్న భారత-ఏ జట్టు భారీ స్కోర్**

**ద్విశతకంతో అదరగొట్టిన కరుణ్ నాయర్ (204)**

**సర్ఫరాజ్ (92), ధ్రువ్ జురెల్ (94)**



ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ముందు ఇండియా–ఏ జట్టు ఇంగ్లిష్ గడ్డపై సత్తా చాటుతోంది. ప్రస్తుతం ఇండియా–ఏ టీమ్, ఇంగ్లండ్ లయన్స్ మధ్య జరుగుతున్న నాలుగు రోజుల అనధికార టెస్టు మ్యాచ్ నిన్నటి నుంచి ప్రారంభమైంది. ఫస్ట్ బ్యాటింగ్ చేస్తున్న భారత–ఏ జట్టు భారీ స్కోర్ చేసింది. టీమిండియా బ్యాటర్ కరుణ్ నాయర్ డబుల్ సెంచరీ చేసి సత్తా చాటాడు.తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా–ఏ జట్టు మూడు వికెట్ల నష్టానికి 409 పరుగులు చేసింది. మొదటి రోజు సెంచరీ చేసిన కరుణ్ నాయర్, రెండో రోజు ద్విశతకం బాదాడు. తొలి రోజు ఆటముగిసే సమయానికి కరుణ్ 186, ధ్రువ్ జురెల్ 82 పరుగులతో క్రీజులో ఉన్నారు. రెండో రోజు ఆట ప్రారంభమైన కొద్ది సేపటికే కరుణ్ నాయర్ డబుల్ సెంచరీ పూర్తి చేశాడు. ద్విశతకం చేసిన తర్వాత దూకుడుగా ఆడే క్రమంలో ఔటయ్యాడు. మొత్తంగా 281 బంతులు ఆడిన కరుణ్ నాయర్ 26 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 204 పరుగులు చేశాడు. అటు వైస్ కెప్టెన్ ధ్రువ్ జురెల్ 120 బంతుల్లో 94 పరుగులు చేసి, త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. నిన్న సర్ఫరాజ్ ఖాన్ కూడా 92 రన్స్ చేసి పెవిలియన్ చేరడంతో శతకం చేజారింది. కరుణ్, సర్ఫరాజ్, జురెల్ రాణించడంతో ఇండియా–ఏ జట్టు 500 మార్క్‌ను దాటింది. డొమెస్టిక్ క్రికెట్‌లో అదరగొట్టిన కరుణ్ నాయర్ ఈ మ్యాచ్‌లోనూ రాణించడంతో బీసీసీఐ సెలక్టర్లు ఆనందంలో ఉన్నారు. ఇంగ్లండ్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌కు కూడా కరుణ్ నాయర్ ఎంపికైన విషయం తెలిసిందే. టీమిండియా సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో ఇప్పుడు అందరి ఆశలు కరుణ్‌పైనే ఉన్నాయి.

క, ఇంగ్లండ్, భారత్ మధ్య టెస్టు సిరీస్ జూన్ 21 నుంచి ప్రారంభం కానుండగా.. అంతకు ముందే ఇండియా–ఏ జట్టు–ఇంగ్లండ్ లయన్స్ మధ్య రెండు అనధికార టెస్టు మ్యాచ్‌లు జరగనున్నాయి. మే 30 నుంచి జూన్ 2 వరకు ఒకటి, రెండోది జూన్ 6 నుంచి 9 వరకు జరగనుంది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## అక్కినేని అఖిల్ వివాహం..
# సీఎం రేవంత్‌కు ఆహ్వానం



అక్కినేని ఇంట మరోసారి పెళ్లిబాజాలు మోగనున్నాయి. గతేడాది నాగార్జున పెద్ద కుమారుడు నాగచైతన్య-శోభితా వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆయన చిన్న కొడుకు అఖిల్ కూడా పెళ్లి చేసుకోబోతున్నారు. ప్రముఖ బిజినెస్‌మెన్ జుల్ఫీ రవ్‌డ్జీ కుమార్తె జైనబ్‌తో గతేడాది నవంబర్ 26న అఖిల్ నిశ్చితార్థం జరిగింది. జూన్ 6న అఖిల్- జైనబ్ పెళ్లి చేసుకోబోతున్నట్లు సమాచారం. దీంతో తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డిని నాగార్జున ఆహ్వానించారు. ఈరోజు ఉదయం భార్య అమల, వియ్యంకులతో కలిసి జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిశారు. అనంతరం అఖిల్ వెడ్డింగ్ కార్డుని ఆయనకు అందించారు. ఈ సందర్భంగా నాగార్జున దంపతులు సీఎం రేవంత్ రెడ్డితో కాసేపు ముచ్చటించారు. కాగా, అన్నపూర్ణ స్టూడియోలో అఖిల్ వివాహం జరుగుతుందని సమాచారం. ఆ తర్వాత రాజస్థాన్‌లో గ్రాండ్‌గా రిసెప్షన్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.

# మాస్ రాజాకి జోడీగా శంకర్ కుమార్తె!



మాస్ రవితేజ కథానాయకుడిగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఓ చిత్రం లాక్ అయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రవితేజ 'మాస్ జాతర'లో నటిస్తున్నాడు. ఈ సినిమా పూర్తికాగానే పట్టాలెక్కే ప్రాజెక్ట్ కిషోర్ దే. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా రవితేజకు జోడీగా కొంత మంది పేర్లు కూడా తెర పైకి వచ్చాయి. కేతికశర్మ, మమితా బైజు, కయాదులో లోహర్ పేర్లు వినిపించాయి. తాజాగా స్టార్ డైరెక్టర్ శంకర్ కుమార్తె అదితి శంకర్ పేరు తెరపైకి వచ్చింది. రావడమే కాదు మిగతా ముగ్గురు కంటే అదితి శంకర్ ఈ పాత్రకు పర్ఫెక్ట్ గా సూటువుతుంది. అదితిపై టెస్ట్ షూట్ చేయగా రవితేజ సరసన అన్ని రకాలుగా సెట్ అవుతుందట. దీంతో అదితి ఎంపిక అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే మమితా బైజు, కేతిక శర్మ, కయాదులపై ఇంకా లుక్ టెస్ట్ నిర్వహించలేదు. మరి అదితి నుంచి పాజిటివ్ ఇంప్రెసన్ వచ్చిన నేపథ్యంలో ఈ ముగ్గురిని కూడా లుక్ టెస్ట్ కి పిలుస్తారా? అదితి శంకర్ నే ఫైనల్ చేస్తారా? అన్నది చూడాలి. అవకాశం వస్తే అదితి శంకర్ కి మాత్రం గొప్ప ఛాన్స్ అవుతుంది. రీసెట్ గా 'భైరవం'సినిమాతో అదితి శంకర్ టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయమైంది. 'భైరవం'లో అదితి స్క్రీన్ ప్రజెన్స్ కి మంచి మార్కులు పడ్డాయి. ఇప్పటికే తమిళ్ లో బాగానే అవకాశాలు అందుకుంటుంది. యంగ్ హీరోలకు పర్ఫెక్ట్ జోడీగా సెట్ అవుతుంది. సీనియర్ హీరోలకు ప్రమోట్ అవుతుంది. ఈ నేపథ్యంలో రవితేజ ఆఫర్ నిజమైతే? అదితి శంకర్ టాలీవుడ్ కెరీర్ లో మరో కొత్త అడుగు ముందుకు పడినట్లే. అవకాశాల పరంగా అదితి తండ్రి ఇమేజ్ తో సంబంధం లేకుండా అందుకుంటుంది.

# ప్లీజ్.. పొగ తాగకండి
## : అల్లు అర్జున్



యువతపై సినిమా హీరోల ప్రభావం ఎక్కువగా ఉంటుందనే విషయం తెలిసిందే. అందుకే వారితో ప్రకటనలు చేసేందుకు కంపెనీలు ముందుకువస్తుంటాయి. అయితే, తమ అభిమానులకు హాని చేసే వాటిని వ్యతిరేకించేవారు కొందరు మాత్రమే ఉంటారు. నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 'ప్లీజ్.. పొగ తాగకండి' అని అల్లు అర్జున్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పోస్ట్ చేయడంపట్ల పలువురు ప్రశంసిస్తున్నారు. ఇతర నటీనటులు సైతం ఇలా పొగాకు, మద్యపానంపై అవగాహన కల్పించాలని నెటిజన్లు సూచిస్తున్నారు.

"నిప్పులా ఉండండి. పొగ తాగొద్దు. పొగ తాగకు బ్రదర్" అని బన్నీ తన ఇన్‌స్టా స్టోరీ రాసుకొచ్చారు. దీనికి 'స్మోకింగ్ కిల్స్' అనే క్యాప్షన్‌తో ఉన్న టీషర్టు ధరించి ఉన్న ఫొటోను అల్లు అర్జున్ జోడించారు. ఇదిలాఉంటే... ప్రస్తుతం ఐకాన్ స్టార్ కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీతో తన తర్వాతి ప్రాజెక్ట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. జూన్‌లో చిత్రీకరణ ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్ట్ '%గా22 ఇ ూా%6'గా పిలవబడుతున్న ఈ చిత్రం, భారతీయ విలువలతో కూడిన కథనంతో ఓ భారీ ఎమోషనల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుందని సమాచారం. ఇక, సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కించిన 'పుష్ప' సినిమాతో పాన్ ఇండియా స్టార్ గా మారిపోయారు బన్నీ. 'పుష్ప 2' చిత్రంతో ఏకంగా ఇండియన్ సినిమా ఇండస్ట్రీ రికార్డ్ క్రియేట్ చేశారు. ఇది బాక్సాఫీస్ దగ్గర రూ.1870 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. దీంతో అల్లు అర్జున్ తర్వాతి ప్రాజెక్ట్ పై అందరిలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈసారి ఎలాంటి సినిమాతో వస్తారో అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## పర్సంటేజీల సమస్య..
# వీరమల్లుకు ఏం సంబంధం?:
## ఆర్.నారాయణమూర్తి



టాలీవుడ్ లో కొద్దిరోజులుగా ఎలాంటి పరిణామాలు నెలకొన్నాయో అందరికీ తెలిసిందే. ఇప్పుడు వాటిపై నటుడు, దర్శకుడు, నిర్మాత ఆర్ నారాయణమూర్తి స్పందించారు. పర్సంటేజీల విషయం ఒక కొలిక్కి వచ్చే దశలో హరిహర వీరమల్లు మూవీకి లింక్ పెట్టడం సరికాదని తెలిపారు. పవన్ కళ్యాణ్ పై ఎవరు కుట్ర చేస్తారని ఆయన ప్రశ్నించారు."పర్సంటేజీల సమస్య ఇండస్ట్రీలో ఎన్నో ఏళ్ల నుంచి కొనసాగుతోంది. అది ఖరారు అయితే ఎంతో మేలు జరుగుతుంది. అప్పట్లో ఛాంబర్ ముందు ఆందోళనలు చేశాం. కానీ పరిష్కారం లభించలేదు. ఆ తర్వాత ఇండస్ట్రీ పెద్దలను కలిశాం. కానీ ఇంకా సమస్య పరిష్కారం కాలేదు. ఎంతో మందికి ఇప్పటికే విజ్ఞప్తి చేశాం" అని తెలిపారు."ఇప్పుడు పర్సంటేజీ విషయం కొలిక్కి వచ్చే దశలో హరిహర వీరమల్లు మూవీకి లింక్ పెట్టడం సరికాదు. అసలు సమస్యకు మూవీకి ఏం సంబంధం ఉంది? సమస్యను పక్కదోవ పట్టించారు. పవన్ కళ్యాణ్ కార్యాలయం నుంచి అలాంటి ప్రకటన రావడం సమంజసంగా లేదు. చర్చలకు పిలిస్తే పవన్ పై గౌరవం మరింత పెరిగేది" అని అన్నారు."పరిశ్రమ పెద్దలను సీఎం చంద్రబాబు నాయుడు గారిని కలవాలని చెప్పడంలో తప్పులేదు. కానీ అసలు సమస్యను పక్కదారి పట్టించవద్దు. హరిహర వీరమల్లు కోసమే జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేస్తున్నారనేది పూర్తిగా అబద్ధం. పర్సంటేజ్ ఫిక్స్ అయితే అందరికీ మేలు. నా లాంటి నిర్మాతలకు కూడా మేలే" అని తెలిపారు."కార్పొరేట్ పద్ధతులకు వంత పాడితే సింగిల్ స్క్రీన్లు ఏమవ్వాలి? ఆలయాల్లాంటి థియేటర్స్ ఇప్పుడు మ్యారేజ్ ఫంక్షన్ హాళ్లు గా మారుతున్నాయి. కాబట్టి పర్సంటేజీని బతికించి నా లాంటి నిర్మాతలను కాపాడాలి" అని కోరారు. ఆ తర్వాత సినిమా టికెట్ రేట్ల పెంపు విషయంపై మాట్లాడారు. వినోదం ఖరీదుగా మారిందని అన్నారు.'రేట్ల పెంపు విషయంలో ప్రేక్షకులకు, ఇండస్ట్రీకి ఎక్కువ నష్టం వస్తుంది. పెద్ద బడ్జెట్ తో సినిమాలు తీయండి. కానీ దాన్ని ప్రజలపై రుద్దితే నష్టమే. హాలీవుడ్ లో వందల కోట్లతో సినిమాలు తీస్తున్నారని, కానీ ధరలు పెంచడం లేదు. ఏదేమైనా సినిమా బాగుంటే ఆడియన్స్ కచ్చితంగా వస్తారు. టికెట్ ధరలు పెంచడం వల్ల అభిమానులే వాళ్ల హీరోల సినిమాలు చూడని పరిస్థితులు వచ్చాయి" అని నారాయణమూర్తి అభిప్రాయపడ్డారు.

# 'దండోరా' మూవీతో నటిగా ఎంట్రీ ఇస్తున్న సింగర్ అదితి భావరాజు



లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌ను స్థాపించి తొలి చిత్రం 'కలర్‌ఫొటో'తో అందరి దృష్టిని ఆకర్షించిన డైనమిక్ ప్రొడ్యూసర్ రవీంద్ర బెనర్జీ ముప్పనేని.. ఆ తర్వాత 'బెదురులంక 2012' వంటి సూపర్ హిట్ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పుడు 'దండోరా' మూవీతో వస్తున్నారు. ఈ చిత్రానికి మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. గ్రామీణ తెలంగాణ నేపథ్యంలో రూపొందుతోన్న'దండోరా'లో బలమైన ప్రేమ కథాంశంతో పాటు కఠినమైన నిజాలను, సమాజంలో కొనసాగుతోన్న సామాజిక దుష్ప్రవర్తనను ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య తదితరులు ప్రధాన పాత్రల్లో మెప్పించనున్నారు.

అలాగే, టాలెంటెడ్ సింగర్ అదితి భావరాజు నటిగా ఈ చిత్రంతో సిల్వర్ స్క్రీన్‌పై ఎంట్రీ ఇస్తున్నారు. ఎన్నో చార్ట్ బస్టర్ సాంగ్స్‌ను ఆలపించిన అదితి..'దండోరా' చిత్రంతో వెండి తెరపై మెరవనున్నారు. ఆమె ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు. 'దండోరా' మూవీ ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో పలు కీలక షెడ్యూల్స్‌ను పూర్తి చేశారు. ఇటీవల విడుదలైన మూవీ ఫస్ట్ బీట్ టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. దీంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. రాబోయే రోజుల్లో సినిమా నుంచి మరిన్ని ఆసక్తికరమైన విశేషాలను తెలియజేస్తామని మేకర్స్ తెలియజేశారు. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్నఈ సినిమాకు మార్క్ కె.రాబిన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. వెంకట్ ఆర్.శాఖమూరి సినిమాటోగ్రాఫర్‌గా, సృజన అడుసుమిల్లి ఎడిటర్‌గా, క్రాంతి ప్రియం ఆర్ట్ డైరెక్టర్‌గా, రేఖా బొగ్గారపు కాస్ట్యూమ్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు. ఎడ్వర్డ్ స్టీవెన్‌సన్ పెరెజి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, కొండారు వెంకటేశ్ లైన్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

# రెమ్యునరేషన్ వల్లే నో చెప్పా



రెబల్ స్టార్ ప్రభాస్, ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబోలో 'స్పిరిట్' అనే సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. అయితే, ఈ మూవీలో మొదట దీపిక పదుకొణెని హీరోయిన్‌గా అనుకున్న సందీప్ రెడ్డి.. ఆ తర్వాత ఆమెను తీసేశారు. దీపిక అనేక కండిషన్లు పెట్టడం వల్లే ఆమెను సందీప్ పక్కన పెట్టారనే వార్తలొచ్చాయి. తాజాగా దీపిక స్థానంలోకి యానిమల్ బ్యూటీ త్రిప్తి డిమ్రీని తీసుకున్న సంగతి తెలిసిందే. దీనికి ప్రతి చర్యగా ఆమె పీఆర్ టీం స్పిరిట్ స్టోరీని లీక్ చేసినట్లు సమాచారం. దీంతో దీపిక పదుకొణె, ఆమె పీఆర్ టీమ్‌పై సందీప్ రెడ్డి వంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'డర్టీ పీఆర్ గేమ్స్' అంటూ 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) వేదికగా ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దీంతో గత కొద్ది రోజులుగా దీపిక పేరు నెట్టింట మారుమ్రోగిపోతుంది. ఈ క్రమంలో తాజాగా దీపిక ఓ ఇంటర్వ్యూలో స్పిరిట్ నుంచి తప్పుకోవడానికి గల కారణమేంటో చెప్పారు. ఆమె మాట్లాడుతూ... "ఇటీవల ఓ దర్శకుడు నన్ను కలిసి స్టోరీ చెప్పారు. స్టోరీ చాలా బాగా నచ్చింది. కానీ, రెమ్యునరేషన్ గురించి చర్చ వచ్చినప్పుడు ఇంత చార్జ్ చేస్తా అని అన్నాను. దానికి వారు ఒప్పుకోలేదు. అందుకే నేను వారికి నో చెప్పాను. నా ట్రాక్ రికార్డ్ నాకు తెలుసు. అందుకే ఆ సినిమాకి నేను ఒప్పుకోలేదు" అని దీపిక చెప్పుకొచ్చారు. ఇదిలాఉంటే.. ఇప్పుడు ఈ బాలీవుడ్ ముద్దుగుమ్మ అట్లీ- అల్లు అర్జున్ కాంబోలో రానున్న భారీ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా ఎంపికైనట్టు తెలుస్తోంది. దీపిక ఈ మధ్య 'కల్కి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులని పలకరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు బన్నీతో జతకట్టనున్నారు.

PRINTED,PUBLISHED AND OWENED BY BEZAWADA NAGA BHARGAVI AND PRINTED AT: V PRINT GRAPHICS S-14,ADDEPALLI COMPLEX,GUDIWADA-521-301 , KRISHNA DISTRICT ,ANDHRA PRADESH AND PUBLISHED FROM H.NO 12 /323,TAILORING VEEDHIGUDIVADA -521 301,KRISHNA DISTRICT, ANDHRA PRADESH
EDITOR : BEZAWADA EDUKONDALU,RNI TITLE CODENO: APBIL16314, PHONE NO: 9849044212, EMAIL ID :